నవతెలంగాణ

ఆదిలాబాద్

సోమవారం | జులై 29, 2024 | www.navatelangana.com

అనారోగ్య కారణాలతో మహిళ ఆత్మహత్య

నవతెలంగాణ-మంచిర్యాల



మంచిర్యాల పట్టణంలోని పాత మంచిర్యాలకు చెందిన ధరణి పద్మ(45) అనారోగ్య కారణాలతో ఆత్మహత్య చేసుకున్నట్లు పట్టణ ఎస్ఐ ఎం.ప్రశాంత్ తెలిపారు. గత వారం రోజుల క్రితం ఇంట్లో నుండి వెళ్లి పోయిందని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చెప్పట్టిన క్రమంలో గుర్తు తెలియని శవం గోదావరిలో కొట్టుకు వచ్చినట్లు తెలిసిన సమాచారం మేరకు ఆదివారం తెల్లవారు జామున సితరంపల్లి పంప్ హౌజ్ వద్ద జాలర్లతో శవాన్ని బయటకు తీసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా మృత దేహం ధరణి పద్మ గా కుటుంబ సభ్యులు గుర్తించినట్లు తెలిపారు. గత కొన్ని రోజులగా ఆరోగ్య సమస్యలతో బాధ పడుతుందని అదే క్రమంలో ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. మృత దేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి పంచనామా అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

అడవి పంది దాడిలో రైతుకు తీవ్ర గాయాలు

నవతెలంగాణ-హాజీపూర్



రైతుపై అడవి పంది దాడి చేసి గాయ పరిచిన ఘటన మండలంలోని రాపల్లి గ్రామంలో చోటుచేసుకున్నది. గ్రామానికి చెందిన సింగం చిన్నయ్య ఆదివారం రాపల్లి పాత గ్రామంలో చిన్నయ్య సాగు చేస్తున్న పత్తి చేనులో పంటను పరిశీలిస్తుండగా ఒక్కసారిగా చిన్నయ్యపై అడవి పంది దాడిచేసింది. అది గమనించిన తోటి రైతులు అరుస్తూ పంది వెంట పడటంతో పారిపోయింది. దాడికి గురైన రైతును తోటి రైతులు మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

వేలాన్ని ఆపుదాం.. సింగరేణిని రక్షించుకుందాం..!



- పరిరక్షణ బస్సు యాత్రకు శ్రీకారం చుట్టిన సీపీఐ(ఎం)
- కోల్‌బెల్ట్ ఏరియాలో వారం రోజుల పాటు నిర్వహణ
- నేడు బెల్లంపల్లిలో ప్రారంభించనున్న రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం
- మంచిర్యాలలో జిల్లాలో రెండు రోజులు పర్యటించనున్న యాత్ర బృందం
- ఆగస్టు 5న కొత్తగూడెంలో ముగింపు

బొగ్గు బ్లాకుల వేలాన్ని ఆపుదాం.. సింగరేణిని కాపాడుకుందాం..అనే లక్ష్యంతో సీపీఐ(ఎం) సింగరేణి పరిరక్షణ బస్సు యాత్రకు శ్రీకారం చుట్టింది. దేశ సహజ సంపదను కార్పొరేట్ సంస్థలకు అప్పగించే ప్రయత్నం చేస్తున్న కేంద్రప్రభుత్వ కుట్రలను నిరసిస్తూ ఈ యాత్రను చేపట్టబోతోంది. రాష్ట్ర ఆర్థిక అభివృద్ధి..నిరుద్యోగ సమస్య పరిష్కారంలో తన వంతు పాత్ర పోషిస్తున్న సింగరేణి సంస్థ ప్రయివేటుతో పోటీపడాలనే విధానాన్ని సీపీఐ(ఎం)తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ కుటిల నీతిని అడ్డుకునేందుకు చేపడుతున్న ఈ యాత్ర కోల్‌బెల్ట్ ఏరియాలో వారం రోజుల పాటు సాగనుంది. మంచిర్యాల జిల్లాలోని శ్రావణపల్లి బొగ్గు బ్లాక్ సైతం వేలంలో పెట్టింది. బొగ్గు బ్లాకుల వేలాన్ని నిలిపివేసి..సింగరేణికే కట్టబెట్టాలని డిమాండ్ చేస్తోంది. వారం రోజుల పాటు నిర్వహించే ఈ యాత్ర మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో మొదలుకానుంది. ఈ బస్సుయాత్రను సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ప్రారంభించనున్నారు.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి


తెలంగాణ కొంగుబంగారంగా పిలిచే సింగరేణిని కేంద్రప్రభుత్వం కార్పొరేట్లకు అప్పగించి ప్రయివేటీకరించాలని యత్నిస్తోంది. ఇందులో భాగంగా కొన్ని బొగ్గు బ్లాకులను వేలం వేయాలని నిర్ణయించింది. ఇప్పటికే నాలుగు బొగ్గుబ్లాకులను బీఆర్ఎస్ పాలనలో మోడీ ప్రభుత్వం ప్రయివేటు సంస్థలకు అప్పగించింది. ఇలా బొగ్గుబ్లాకులన్ని ప్రయివేటు సంస్థలకు అప్పగిస్తే రానున్న రోజుల్లో సింగరేణి బలహీనపడి మూతపడే పరిస్థితి వస్తుంది. తాజాగా మంచిర్యాల జిల్లాలోని శ్రావణపల్లి బొగ్గుబ్లాకును కూడా వేలంలో పెట్టింది. దీన్ని నిరసిస్తూ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో సింగరేణి పరిరక్షణ బస్సు యాత్రను చేపట్టబోతోంది. ఈ నెల 29న ప్రారంభమయ్యే ఈ యాత్ర సింగరేణి వ్యాప్తంగా వారం రోజుల పాటు కొనసాగనుంది. ఆగస్టు 5న కొత్తగూడెంలో ముగియనుంది.

ప్రారంభించనున్న తమ్మినేని వీరభద్రం..!

సింగరేణి వ్యాప్తంగా ఈ యాత్ర సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్.వీరయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్, పైళ్ల ఆశయ్య ఈ యాత్రను చేపడుతున్నారు. సోమవారం బెల్లంపల్లి కాంటా చౌరస్తాలో మొదలుకానున్న ఈ పరిరక్షణ బస్సు యాత్రను సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు ప్రారంభించనున్నారు. సోమ, మంగళవారాల్లో మంచిర్యాల జిల్లాలోని సింగరేణి ప్రాంతంలోనే ఈ యాత్ర సాగనుంది. తొలి రోజున ఉదయం సభ ముగిసిన అనంతరం మధ్యాహ్నం 12.30గంటలకు సోమగూడెం ఎక్స్‌రోడ్ నుంచి బయలుదేరి 1గంటలకు మందమర్రికి చేరుకుంటుంది. మధ్యాహ్నం 2.30గంటలకు ప్రెస్‌మీట్, మార్కెట్ సెంటర్‌లో కార్నర్ మీటింగ్, బస్తీల్లో పర్యటన చేపట్టనున్నారు. సాయంత్రం 4గంటలకు రామకృష్ణాపూర్ బస్తీల్లో పర్యటన, సాయంత్రం 5గంటలకు ఆర్‌కేపీ సూపర్ బజార్ వద్ద కార్నర్ మీటింగ్ నిర్వహించనున్నారు. 30న ఉదయం 6.30గంటల నుంచే బొగ్గుబావులపై గేట్ మీటింగ్‌లు, ఏరియాల్లో కార్నర్ మీటింగ్‌లు చేపట్టనున్నారు. మంగళవారం నిర్వహించే ఈ యాత్రకు ముఖ్య అతిథిగా పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ చేరుపల్లి సీతారాములు హాజరుకానున్నారు.

యాత్రను జయప్రదం చేయాలి

- సంకె రవి, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి, మంచిర్యాల



సింగరేణి బొగ్గుబ్లాకులను వేలం వేసి ప్రయివేటీకరణకు అప్పగిస్తే తీవ్ర నష్టం జరుగుతుంది. ప్రత్యక్షంగా..పరోక్షంగా వివిధ వర్గాలకు చెందిన సుమారు 5లక్షల మందికి నష్టం వాటిల్లుతుంది. ఉపాధి దూరమవుతుంది. ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది. ముఖ్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఈ విషయంలో అందరినీ కలుపుకొని పోరాటం సాగించాలి. సింగరేణి పరిరక్షణ కోసం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో చేపడుతున్న బస్సు యాత్రకు కార్మికులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలి.

జాతీయ రహదారిపై బస్సు షెల్టర్లు నిర్మించాలి



నవతెలంగాణ-రెబ్బెన

మండలంలోని తక్కలపల్లి గ్రామం నుంచి ఆసిఫాబాద్ మండలం భాగ్యనగర్ మీదుగా వాంకిడి మండలం గోయగాం గ్రామం వరకు డీబీఎల్ కంపెనీ 363 ఎన్‌హెచ్ నాలుగు వరుసల జాతీయ రహదారిపై బస్ షెల్టర్లు నిర్మించాలని డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు చాపిడి పురుషోత్తం అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సరైన సిగ్నల్ వ్యవస్థ, రోడ్డు ఇరువైపులా డివైడర్లు నియమించడంలో నిర్లక్ష్యం వహించారని, దాంతో పాటు ప్రతి గ్రామం, ఎక్స్ రోడ్డు వద్ద బస్ సెల్టర్లు నిర్మించలేదని ఆరోపించారు. ప్రజలు ప్రయాణ సమయంలో వర్షాలకు తడుస్తూ ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. డీబీఎల్ కంపెనీ యాజమాన్యం రహదారిపై బస్ సెల్టర్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షురాలు చాపిడి శ్రావణి, జిల్లా సహాయ కార్యదర్శి ఆత్మకూరి సతీష్, జిల్లా కమిటీ సభ్యుడు చాపిడి శివ పాల్గొన్నారు.

సమస్యల్లో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు



నవతెలంగాణ-మంచిర్యాల

రాష్ట్ర వ్యాప్తంగా నేషనల్ హెల్త్ మిషన్ పథకం కింద పని చేస్తున్న ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లేందుకు కృషి చేస్తామని జాతీయ ఆరోగ్య మిషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా తెలిపారు. ఆదివారం మంచిర్యాల పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకలదాసు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా నేషనల్ హెల్త్ మిషన్‌లో దాదాపు 17 వేల మంది ఉద్యోగులు వివిధ కేటగిరీల్లో పని చేస్తున్నారని, పని భారం తక్కువ వేతనంతో సతమతమవుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం సమస్యలను పరిష్కరించేంతవరకు కలసికట్టుగా పోరాటాలు చేద్దామని పిలుపునిచ్చారు. ప్రభుత్వం వెంటనే రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు. ఏఐటీయూసీలో నూతనంగా ఎన్‌హెచ్‌ఎంలో పని చేస్తున్న 150 మంది చేరినట్లు వారికి ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు కండువ కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో దేవన బోయిన బాపు యాదవ్, కలందర్, మహేందర్, డాక్టర్ జానపాటి శరత్ బాబు, డెవలప్, అప్సర, సందీప్, సరితా, సంధ్య, రాణి, దేవా, మహేందర్, రాజు గౌడ్, కీర్తి, అంజలి, సౌమ్య, మంజుల పాల్గొన్నారు.

ఐదు రోజుల బంద్‌ను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-నస్పూర్

మంచిర్యాల ప్లంబర్ అసోసియేషన్ తరపున నూతన గృహ నిర్మాణ యజమానులు, ప్లంబర్ షాప్ యజమానులు, భవన నిర్మాణ సంఘ కార్మికులు బిల్డర్స్, అన్ని కార్మిక సంఘాలు జులై 29 నుండి ఆగస్టు 2 వరకు జరగబోయే 5 రోజులు బందును విజయవంతం చేయాలని ప్లంబర్ అసోసియేషన్ కార్మికులు పిలుపునిచ్చారు. ఆదివారం నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్ క్లబ్ నిర్వహించిన సమావేశంలో గోడప్రతులను విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్లంబర్ అసోసియేషన్‌లో సభ్యత్వం లేని ప్లంబర్లు పనిచేయరాదని, బుక్ రేటు ప్రకారం ప్లంబర్లకి పనిని కల్పించి ప్రతి ప్లంబర్ బుక్ రేట్ ప్రకారం పని చేయాలన్నారు. ప్రతి ఒక్క ప్లంబర్ మేస్త్రి, వర్కరు లేబర్ కార్డు కలిగి ఉండాలని, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారు ప్లంబర్ పని చేయరాదని తెలిపారు. ప్లంబర్ సామాను దొంగతనాలను అరికట్టి షాప్ యజమానులు బిల్లు లేకుండా, ఇంటి యజమాని లేకుండా సామాను వాపస్ తీసుకోకూడదని కోరారు. ప్రతి ఒక్క ప్లంబర్ మేస్త్రిని ఒక టెక్నీషియన్‌గా గుర్తించాలన్నారు. ఇట్టి విషయాలను పరిగణలోకి తీసుకొని నూతన గృహ నిర్మాణ యజమానులు, ప్లంబర్ షాప్ యజమానులు, బిల్డర్లు, భవన నిర్మాణ సంఘ కార్మికులు ఆగస్టు 2న శుక్రవారం వేంపల్లిలోని గార్డెన్‌లో నిర్వహించే ప్లంబర్ మహాసభను విజయవంతం చేయాలని కోరారు.

బోనమెత్తిన ఎమ్మెల్యే రామారావు పటేల్

- గట్టు మైసమ్మ ఆలయంలో పూజలు

నవతెలంగాణ-భైంసా

పట్టణంలోని గట్టు మైసమ్మ ఆలయంలో నిర్వహించిన బోనాల పండుగ వేడుకల్లో ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ పాల్గొన్నారు. ఆదివారం బోనం కుండలతో అమ్మవారి ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షాలు పుష్కలంగా కురవాలని, పంటలు బాగా పండాలని, ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని, ఆ మైసమ్మ తల్లిని వేడుకున్నట్టు ఎమ్మెల్యే చెప్పారు. ఆలయ అభివృద్ధికి తనవంతుగా పాటుపడతానని అన్నారు. ఆయన వెంట మాజీ మున్సిపల్ చైర్మెన్ బి.గంగాధర్, బీజేపీ సీనియర్ నాయకులు సతీష్‌రావ్, స్థానిక నాయకులు ఉన్నారు.

కాసుల కోసం కాళేశ్వరానికి తరలించారు

- ఎమ్మెల్సీ దండె విఠల్

నవతెలంగాణ-కౌటాల



కాసుల కోసం కాళేశ్వరంకు ప్రాణహిత ప్రాజెక్టు గత బీఆర్ఎస్ ప్రభుత్వం తరలించిందని ఎమ్మెల్సీ దండె విఠల్ ఆరోపించారు. గత పాలకుల మొండి వైఖరితో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రైతాంగానికి తీరని అన్యాయం జరిగిందని, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిన అంబేద్కర్ ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు కేసీఆర్ సర్కార్ పక్కన పెట్టిందని, ఇప్పుడు మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్ట్ కట్టేందుకు నిర్ణయం తీసుకోవడం శుభ పరిణామమన్నారు. ప్రాణహిత ప్రాజెక్టు నిర్మాణం చేస్తామని అసెంబ్లీ సాక్షిగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క శనివారం ప్రకటించిన నేపథ్యంలో ఆదివారం కౌటాల మండలం తుమిడిహెట్టి వద్ద ప్రాణహిత నదికి సంగమ స్థానంలో నాయకులతో ప్రత్యేక పూజలు చేశారు. ప్రాణహిత నదికి పసుపు కుంకుమతో పూజలు చేసి చీర సారే సమర్పించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రైతన్నకు మేలు చేసేలా నిర్ణయం తీసుకున్నందుకు సీఎం రేవంత్ రెడ్డికి పాలాభిషేకం చేసి ధన్యవాదలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్వ ఆదిలాబాద్ జిల్లాకు సరిహద్దుగా గోదావరి, వార్ధ, ప్రాణహిత నదులు ప్రవహిస్తున్నా రైతులకు నీళ్ళు లేక పంటలు సరిగ్గా పండని దుస్థితి ఉండేదన్నారు. దీన్ని రూపుమాపేందుకు ఇప్పుడు సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చొరవ తీసుకొని అసెంబ్లీలో ప్రకటించడం రైతులకు ఆనందం కలిగించిందన్నారు. పది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ప్రాణహిత బ్యాక్ వాటర్‌తో పంటలు నీట మునిగి రైతులు నష్టపోయిన విషయాన్ని ఇప్పటికే మండలిలో మంత్రుల దృష్టికి తీసుకు వచ్చామని, పరిహారం ఇచ్చేందుకు కూడా మంత్రులు సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఆసిఫాబాద్ జిల్లాలోని బెజ్జూర్, కౌటాల, చింతలమానేపల్లి, దహెగాం మండలాల్లో వేలాది ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు అధికారులు నివేదిక ఇచ్చారని తెలిపారు. భారీ వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు, వంతెనలు వర్షం తగ్గిన వెంటనే రిపేర్లు చేసి, తర్వాత శాశ్వతంగా నిర్మాణం చేస్తామని చెప్పారు. పంద్రాగస్టు నాటికి రాష్ట్రంలో రైతులంతా రుణ విముక్తులు అవుతారని, కాంగ్రెస్ ఇచ్చిన హామీలతో రైతులు, ప్రజలు ఆనందంగా ఉన్నారన్నారు. ఆయనతో పాటు పీసీసీ మెంబర్ అర్షద్ హుస్సేన్, మాజీ ఎంపీపీలు విశ్వనాథ్, నానయ్య, ఆరే సంఘం జిల్లా అధ్యక్షుడు బొట్టుపల్లి జయరాం, మాజీ సర్పంచ్లు చరణ్ దాస్, సోమయ్య, నాయకులు కలీం పాషా, బాపు, తిరుపతి, రుషి, పిల్లల తిరుపతి, నారాయణ, మారుతి పాల్గొన్నారు.

బొగ్గు బ్లాకులు సింగరేణికి కేటాయించాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు దుర్గం దినకర్
- పరిరక్షణ యాత్ర పోస్టర్ల విడుదల



నవతెలంగాణ-ఆసిఫాబాద్

బొగ్గు బ్లాకులను సింగరేణికి కేటాయించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దుర్గం దినకర్ అన్నారు. సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఈనెల 29 నుండి చేపట్టనున్న సింగరేణి పరిరక్షణ యాత్ర పోస్టర్లను జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. దీనికోసం ఎటువంటి వేలం పాట లేకుండా నేరుగా మంచిర్యాల జిల్లాలోని శ్రావణపెల్లి గనులు సింగరేణికి కేటాయించాలన్నారు. రాష్ట్రంలో ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు ఉన్నప్పటికీ సింగరేణికి గనులు కేటాయించేలా కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించకపోవడం దారుణమన్నారు. గనుల శాఖ మంత్రిగా కిషన్ రెడ్డికి అవకాశం వచ్చినప్పటికీ సింగరేణి బలోపేతం కోసం కృషి చేయకపోవడం రాష్ట్ర ప్రయోజనాలపై వారికి ఉన్న చిత్తశుద్ధిని తెలిసేలా చేస్తుందన్నారు. ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చే ఉద్దేశంతో వారం రోజుల పాటు సింగరేణి పరిరక్షణ యాత్ర పేరుతో బస్సు యాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు గొడిసెల కార్తిక్, రాజేందర్, నాయకులు కృష్ణమాచారి పాల్గొన్నారు.

సంక్షేమం సరే... ఉపాధి ఏదీ...?

- నిరుద్యోగంతో నిరుత్సాహానికి గురవుతున్న యువత

నవతెలంగాణ-భైంసా



ప్రజలకు సంక్షేమ పథకాలు ఇస్తున్నారే తప్ప వారికి ఉపాధి మార్గం వైపు ఆలోచించడం లేదు పాలకులు. సంక్షేమంపై దృష్టి సారిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం, ప్రజానీకానికి ఉపాధి మార్గంపై అంతంత మాత్రమే దృష్టి సారిస్తుందని యువత పేర్కొంటోంది. దీంతో గ్రామాల్లో పనులు లేక ప్రజలు ఉపాధి కోసం పరితపిస్తున్నారు. ఇంటర్మీడియట్, డిగ్రీలు చేసిన యువతకు ప్రభుత్వ ఉద్యోగాల్లో పెద్ద మొత్తంలో పోటీ ఉండటంతో, ఆ వైపు వెళ్లక ప్రయివేటు వైపు ఏదో ఒకటి చేసుకుందామనుకున్నా ఉద్యోగాలు దొరకక ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి గ్రామంలో పదివేల రూపాయల ఉద్యోగం కోసం 50 నుంచి 100 మంది యువత ముందుకు వస్తున్నారు. అంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో స్పష్టమవుతుంది. ఒకప్పుడు భైంసా పట్టణం పారిశ్రామిక కేంద్రానికి అడ్డాగా ఉండేది. జిన్నింగ్ ఫ్యాక్టరీలు తగ్గిపోవడం మూలంగా ఇక్కడ ఉపాధి అవకాశాలు తగ్గిపోయాయి. గతంలో జిన్నింగ్ ఫ్యాక్టరీల మూలంగా ఇక్కడి ప్రజానీకానికి ఉపాధి దొరికేది. ప్రస్తుతం మన ప్రాంతంలో ఇండస్ట్రీలు లేకపోవడం మూలంగా పనులు చేసుకోవాలంటే ఇబ్బంది ఎదురవుతుంది. యువకులకు ఉద్యోగాలు దొరకకపోవడంతో గ్రామాల్లో యువత వ్యసనాలకు అలవాటు పడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం వేసవిలో 100 రోజుల పాటు ఉపాధి హామీ చట్టం ద్వారా ఉపాధి కల్పించినప్పటికీ మిగతా రోజుల్లో పని కోసం పాకులాడాల్సిన పరిస్థితి నెలకొంది. బాసర ట్రిపుల్ ఐటీలో సెక్యూరిటీ గార్డ్ పోస్టులకు, క్యాటరింగ్ చేయడానికి ఉద్యోగుల కోసం ఇక్కడి ప్రజలు పోటీ పడుతున్నారంటే నిరుద్యోగం ఎంత పట్టిపీడిస్తుందో అర్థమవుతుంది. దశాబ్దాల పాటు ఇక్కడ పాలించిన పాలకులు నిరుద్యోగం రూపుమాపడంపై దృష్టి సారించలేదు. ఇకనైనా ముధోల్ నియోజక వర్గ ప్రాంత ప్రజలకు ఉపాధి మార్గం ఏర్పాటు చేస్తే నియోజకవర్గ అభివృద్ధి బాటలో ముందడుగు వేస్తుంది.

క్వార్టర్లను మరమ్మతు చేసి, మంచినీటిని సరఫరా చేయాలి

నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలోని సింగరేణి ఉద్యోగులు నివాసం ఉంటున్న అన్ని కాలనీలోని క్వార్టర్ నందు అధిక వర్షాల కారణంగా రూఫ్ లీకేజీలు అయ్యి క్వార్టర్లు మొత్తం నీటితో నిండిపోతున్నాయని వాటిని మరమ్మత్తులు చేయించాలని టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, ఏరియా ఉపాధ్యక్షుడు పెట్టాను లక్ష్మణ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో మాదిరిగా వేసవికాలంలో క్వార్టర్లు రిపేరు చేయాలని, తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం సూచించిన యాజమాన్యం పట్టించుకోకపోవడం వలన ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు .తక్షణమే యాజమాన్యం క్వార్టర్లను పూర్తిస్థాయిలో రిపేరు చేయాలని పేర్కొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
సోమవారం | జులై 29, 2024 | www.navatelangana.com

నీట్‌లో ర్యాంక్ సాధించిన విద్యార్థులకు సన్మానం

నవతెలంగాణ-నార్నూర్



నీట్‌లో ర్యాంక్ సాధించిన తాడిహత్నూర్ గ్రామానికి చెందిన గిరిజన విద్యార్థులు జాదవ్ నవనీత్, రాథోడ్ సిద్ధిజాను ఆదివారం సంత్ సేవాలాల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జగదంబాదేవి ఆలయంలో శాలువాతో ఘనంగా సన్మానం చేశారు. వారితో పాటు వారి కుటుంబసభ్యులను సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులు ఏఓ గణేష్ మాట్లాడుతూ వీరిని ఆదర్శంగా తీసుకొని మిగితా విద్యార్థులు కూడా చదువులపై దృష్టి సారించి, ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు చౌహాన్ కిషోర్, ఉపాధ్యాయులు జాదవ్ పరశురాం, చౌహాన్ మునిరాం, జాదవ్ ఆనంద్‌రావ్, పవార్ బాపురావ్, రామారావ్, నివాస్, దిలీప్, రామేశ్వర, అశ్విన్, ప్రకాశ్, తానజీ నాయక్, దినేష్ పటేల్, ఉమాజీ, విజయ్ ఉన్నారు.

కార్మికుల హక్కుల కోసం పోరాటాలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కార్మికుల హక్కుల కోసం పోరాటాలు ఏఐటీయూసీ పనిచేస్తుందని, రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యూసుఫ్ తెలిపారు. యాదవ సంఘ భవనంలో రెండు రోజుల రాజకీయ శిక్షణ తరగతుల ముగింపును ఆదివారం నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్యఅథితిగా హాజరై రాష్ట్రంలో, దేశంలో అధికారంలో ఉన్న ప్రభుత్వాలు వ్యవహరిస్తున్న తీరును వివరించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యూసుఫ్ మాట్లాడుతూ ఎన్నో ఏండ్లుగా కార్మికుల కోసం చట్టాలను సవరించాల్సి ఉండగా, ప్రభుత్వాలు ఆ దిశగా సాగడం లేదన్నారు. ప్రతి సంవత్సరానికి ఒక సారి వేతన చట్టాన్ని సవరించి వేతనాలు పెంచాలన్నారు. హామీలకు అనుగుణంగా కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్, డిప్యూటి ప్రధాన కార్యదర్శి గాజేంగుల రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ కుంటాల రాములు, చంద్రకళ పాల్గొన్నారు.

ఇష్టరీతిన ల్యాబ్ టెక్నీషియన్‌ల బదిలీలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ల్యాబ్ టెక్నీషియన్‌ల బదిలీల్లో ఇష్టరీతిన వ్యహరించారని ల్యాబ్ టెక్నీషియన్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నిజామొద్దిన్ ఆరోపించారు. ఆదివారం పట్టణంలోని టీఎన్జీవోస్ భవనంలో సంఘ సమావేశం నిర్వహించారు. బదిలీలపై చర్చించి, వెంటనే సవరించాలని కోరారు. ఈ సందర్భంగా ల్యాబ్ టెక్నీషియన్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నిజామొద్దీన్ మాట్లాడుతూ ఇటీవల ల్యాబ్ టెక్నీషియన్ల బదిలీలో భాగంగా పెట్టుకున్న అప్షన్లను కాకుండా ఇష్టరీతిన బదిలీలు చేశారన్నారు. ఉపాధ్యాయులు ఏ విధంగానైతే జీఓ 317తో నష్టపోయారో తాము కూడా అలానే నష్టపోతామన్నారు. ఆదిలాబాద్ వారికి నిజామాబాద్, నిజామాబాద్ వారికి ఆదిలాబాద్ బదిలీ చేశారన్నారు. ప్రభుత్వం ఈ విషయంలో చర్యలు తీసుకుంటు న్యాయం చేయాలని లేని పక్షంలో కోర్టును ఆశ్రయించాల్సి వస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కే.శ్రీనివాస్, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి డి.సంతోష్, జిల్లా ప్రధాన కార్యదర్శి సలీం అన్సరీ, ప్రభాకర్, మడావి శ్రీనివాస్, జీవన్, సంతోష్ కుమారి, సూర్యకళ, శివకాంత పాల్గొన్నారు.

రానున్న స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలి



నవతెలంగాణ-కుభీర్

రాబోయే స్థానిక సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, ఎన్నికలకు గ్రామంలో ప్రతి ఒక కార్యకర్త కష్టపడి పనిచేసేలా కృషి చేయాలని బీజేపీ మండలాధ్యక్షుడు ఏశాల దత్తాత్రి అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన కుభీర్ శివసాయి ఆలయంలో మండల కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పైడిపెల్లి గంగా శేఖర్ హాజరై ప్రారంభించారు. అంతకు ముందు ఇటీవల మరణించిన మాజీ ఎంపీ రాథోడ్ రమేష్, పల్సి సీనియర్ నాయకుడు విఠల్ మరణించడంతో వారికి సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండలాధ్యక్షుడు దత్తాత్రి మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థలు ఎన్నికలకు గ్రామంలో ఉన్న ప్రతి ఒక్క కార్యకర్త కష్టపడి పని చేస్తే సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీలు బీజేపీ అభ్యర్థులను గెలుపొందెలా చూడాలని అన్నారు. అదే విధంగా గ్రామంలో కార్యకర్త ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని ఏర్పాట్లను చేసేలా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సౌంలి రమేష్, మాజీ ఎంపీపీ యోగిత కమలేష్, బీఎస్ఎన్ఎల్ బోర్డ్ డైరెక్టర్ గంగాశేఖర్, మండల ప్రధాన కార్యదర్శి మల్లేష్, వైద్యనాథ్, మండల నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు ఉన్నారు.

జపాన్ సకురా సైన్స్ ప్రోగ్రాంలో ఆదర్శ పాఠశాల విద్యార్థి

నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రానికి చెందిన డి.రసజ్ఞ జిల్లా స్థాయిలో జరిగిన సకురా సైన్స్ జపాన్ కార్యక్రమంలోని బోథ్ ఆదర్శ పాఠశాల విద్యార్థిని మొదటి స్థానంలో నిలిచి, రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం జరిగిందని ప్రిన్సిపాల్ ఉమేష్ తెలిపారు. అలాగే కేంద్రప్రభుత్వం ఖర్చులతో జపాన్‌లో ఏడు రోజుల పాటు జరిగే సైన్స్ అవగాహన రాష్ట్రస్థాయిలో పాల్గొననున్నారని తెలిపారు. జిల్లా నుంచి ఎంపికైనందుకు డీఈఓ ప్రణీత, జిల్లా సైన్స్ అధికారి రఘు రమణ, సెక్టోరల్ అధికారి ఉదయశ్రీ, అధ్యాపకులు అభినందించారు.

పేద విద్యార్థులకు అండగా కార్యక్రమాలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పేద విద్యార్థులకు అవసరమైన వాటిని అందిస్తు వారికి అండగా ఉండేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఉమెన్ వెల్ఫర్ ఆర్గనైజేషన్ ప్రధాన కార్యదర్శి ఇంతేకాబ్ అలం అన్నారు. ఆదివారం పట్టణంలోని బాలక్ మందిర్ పాఠశాల, కళాశాల విద్యార్థులకు షూస్ పంపిణీ చేశారు. హైదరాబాద్‌కు చెందిన ఓ బ్యాంక్ సహకారంతో పేద విద్యార్థులను గుర్తించి షూస్ అందించామని అన్నారు. పేద విద్యార్థులకు నాణ్యమైన షూస్‌ను అందించే బాధ్యత డబ్ల్యూహెచ్‌ఓకు ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. ఇక ముందు కూడా పేదల కోసం తాము అన్ని సంస్థలతో కలిసి పని చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డబ్ల్యూహెచ్‌ఓ ప్రతినిధులు జవద్‌ఖాన్, అంజద్, ఉమ్మిద్ ఫౌండేషన్ అధ్యక్షుడు అజర్, ఖలీల్, పాఠశాల ఉపాధ్యాయుడు ఇమ్రాన్ రసూల్ పాల్గొన్నారు.

వరకట్నం కేసులో ముగ్గురికి రిమాండ్

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

అదనపు వరకట్నం కోసం వేధింపులు భరించలేక పురుగులమందు తాగి మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన పాఠకులకు విధితమే. ఈ కేసులో భర్త జాతురే శివాజీ, మామ జాతురే అంగద్‌తో పాటు అత్త దైవశాలకు ఆదివారం రిమాండ్‌కు తరలించినట్టు ఎస్సై దుబ్బాక సునీల్ తెలిపారు.

నాందేవ్ కాంబ్లే సేవలు చిరస్మరణీయం

నవతెలంగాణ-నార్నూర్



దివంగత డీసీసీబీ చైర్మెన్ నాందేవ్ కాంబ్లే సేవలు చిరస్మరణీయమని జిల్లా సీనియర్ నాయకులు యూనిస్ అఖ్బాని అన్నారు. ఆదివారం మండలంలోని గుంజాల గ్రామంలో నిర్వహించిన మూడో వర్ధంతి కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, జెడ్పీ మాజీ చైర్మెన్ రాథోడ్ జనార్దన్ వేరువేరుగా పాల్గొని మాట్లాడారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సమాజానికి ఆయన చేసిన సేవలను గుర్తు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు బానోథ్ గజానంద్ నాయక్, నాయకులు జ్ఞానోబా పుష్కర్, నర్సింగ్ మోరే, షేక్ దాదే అలీ, సూర్యవంశీ పండరి, డిగాంబర్, మహేందర్, గోవింద్, రాము, మాధవ్, అమర్, రాజు, అరవింద్, శంకర్, కుటుంబ సభ్యులు కాంబ్లె కేశవ్, మాధవ్, ఉద్ధవ్, వివిధ గ్రామాల మాజీ సర్పంచులు, ఉపసర్పంచులు ఉన్నారు.

తప్పుల తడకగా ప్రజాపాలన దరఖాస్తులు

- పేదలకు అందని రాయితీలు
- అధికారుల చుట్టూ తిరుగుతున్న వైనం



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

కొత్త ప్రభుత్వం అధికార పగ్గాలు చేపట్టిన తర్వాత ఎన్నికలో ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలపై ప్రజాపాలనలో దరఖాస్తులను స్వీకరించింది. ఐతే ఈ దరఖాస్తులను స్వీకరించి, ఆన్‌లైన్‌లో హడావిడిగా నమోదు చేశారు. అధికారుల తప్పిదం వల్ల మండలంలోని అనేక గ్రామాల్లో ప్రభుత్వం అందిస్తున్న గృహలక్ష్మీ కింద గ్యాస్, గృహ జ్యోతి కింద 200 యూనిట్ల లోపు విద్యుత్ రాయితీని పొందలేక కార్యాలయాల చుట్టూ చెప్పులరిగేలా తిరుగుతున్నారు. ఇలాంటి బాధితుల్లో సట్వాజీ గూడకు చెందిన ఫడ్ రాజు, శంకర్‌గూడకు చెందిన మస్కే సంజీవ్‌లు ప్రజాపాలన దరఖాస్తులను సమర్పించిన వారికి నెలనెలా విద్యుత్ బిల్లులు రావడంతో స్థానిక ఎంపీడీఓ కార్యాలయం చుట్టూ తిరుగుతున్న అధికారులు మాత్రం తమ చేతిలో ఏమీ లేదంటూ తిప్పి పంపుతున్నారని బాధితులు పేర్కొంటున్నారు. ప్రజాపాలనలో తీసుకున్న దరఖాస్తులను కంప్యూటర్‌లో ఆన్‌లైన్‌లో నమోదు చేసేటప్పుడు కొందరి దరఖాస్తులను నమోదు చేయక పోవడం, కొందరికి విద్యుత్ బిల్లులో యూఎస్సీ నెంబర్ నమోదు చేయక పోవడంతో రాయితీని పొందలేక పోతున్నామని వాపోతున్నారు. అలాగే జాయభాయే.వందన బాయికి అన్ని సవ్యంగా ఉన్న గృహ లక్ష్మీ కింద రెండు సార్లు వంట గ్యాస్ నింపిన కేవలం ఒకే ఒక సారి రూ.300 వంట గ్యాస్ రాయితీ వచ్చిందన్నారు. దాని తర్వాత రెండవ సారి గ్యాస్ సిలిండర్ రిఫిలింగ్ చేసిన కేవలం రూ.45 రాయితీ వచ్చిందని మెసేజ్ వచ్చిందన్నారు. ఇది గమనించిన వినియోగదారులు గ్యాస్ ఏజెన్సీలకు సమాచారం ఇవ్వగా మాకు ఏడాదికి కేవలం మూడు గ్యాస్ బుడ్డిలకే రాయితీ వర్తిస్తుందని తెలుపడం జరిగిందన్నారు. దీంతో వినియోగదారులు చేసేదేమీ లేక పూర్తి డబ్బులను కట్టి గ్యాస్‌ను కొనుక్కుంటున్నారు. ఇవి మచ్చుకు కొన్ని ఉదాహరణలు మాత్రమే ఇలాంటి బాధితులు మండలంలో పదుల సంఖ్యలో ఉన్నారని బాధితులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు ఈ ప్రజాపాలన దరఖాస్తులపై దృష్టిసారించి ప్రజలకు రాయితీని అందించేటట్లు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పాతికేండ్ల తర్వాత ఒకచోట చేరి సందడి చేసి..

- సరస్వతి శిశుమందిర్‌లో అ'పూర్వ' సమ్మేళనం
- గురువులకు ఘన సన్మానం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

చిన్ననాడు బడిలో కలిసి చదువుకున్న పూర్వ విద్యార్థులు పాతికేండ్ల తర్వాత మళ్లీ చదువులమ్మ ఒడిలో కలిశారు. పదో తరగతి పూర్తయ్యాక ఎవరిదారిలో వారు వెళ్లారు. కొందరు ఉన్నత చదువులు చదివి ఉద్యోగాల్లో స్థిరపడగా, మరికొందరు వ్యాపారం, ఇతర రంగాల్లో కొనసాగుతున్నారు. ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా 25 ఏండ్ల తర్వాత మళ్లీ కలుసుకున్నారు. ఆత్మీయ పలకరింపులు, ఆలింగనాల నడుమ నాటి చిలిపి, అల్లరిచేష్టలు, మధుర స్మృతులను నెమరు వేసుకున్నారు. వారు చదువుకున్న తరగతి గదుల్లో కూర్చొని జ్ఞాపకాలను నెమర వేసుకున్నారు. బాల్యమే బాగుండూ అంటూ చర్చించుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. రోజంతా ఉల్లాసంగా గడిపారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని శ్రీ సరస్వతి శిశుమందిర్ ఉన్నత పాఠశాల వేదికగా కలిసి సందడి చేశారు. తమకు చదువులు చెప్పిన గురువులు సూర్యకాంత్, మనోజ్‌రెడ్డి, ఎర్రాల నగేష్, ధరహాస, గోవర్ధన్, నైనలను శాలువతో ఘనంగా సన్మానించి జ్ఞాపికలను బహుకరించారు. నాడు చెప్పిన చదువులతోనే తాము ఈ స్థాయికి ఎదిగామని పేర్కొన్నారు. ఆదిలాబాద్ జిల్లాతో పాటు ఇతర జిల్లాల్లో, వేరే ప్రాంతాల్లో స్థిరపడిన వారు సమ్మేళనానికి హాజరయ్యారు. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా చిన్ననాటి స్నేహితులను కలిసేందుకు ఆరాటపడ్డారు. ఒకే చెంతకు చేరి చిన్న నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. వీరందరిని ఒక చెంత చేర్చేందుకు నెలరోజులుగా పూర్వ విద్యార్థులైన సాయికృష్ణారెడ్డి, సంతోష్, సురేష్, సునీల్, రచన, హరిత, వాణిశ్రీ, మమత, విజయ ఎంతగానో కృషి చేశారు.

31న చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-నార్నూర్



మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు ఈనెల 31న తల పెట్టిన ఛలో హైదరాబాద్ సభను విజయవంతం చేయాలని మధ్యాహ్న భోజన కార్మిక సంఘం మండల ప్రధాన కార్యదర్శి ఝడే నాందేవ్ పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో భోజన కార్మికులతో కలిసి మీడియాతో మాట్లాడారు. 22 సంవత్సరాల కింద పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం ప్రారంభించిన రోజు నుంచి కేవలం వేయి రూపాయల వేతనంతో వంటలు చేసి పిల్లల్లకు వడ్డీస్తున్నామన్నారు. అనేక పోరాటాల అనంతరం గత ప్రభుత్వం రూ.2వేలకు పెంచిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన రూ.10వేల వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. దీనితో పాటు వంట కార్మికులకు ప్రభుత్వమే కోడిగుడ్లు సరఫరా చేయాలన్నారు. ప్రస్తుతం ఇస్తున్న చార్జీలు సరిపోవడం లేనందున మెనూ చార్జీలు రూ.25లకు పెంచాలని అదే విధంగా గ్యాస్, వంట సరుకులు మొత్తం ప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు. గత ఏడాది డిసెంబరు నెల నుంచి పెండింగ్‌లో ఉన్న బిల్లులు వెంటేనే విడుదల చేయాలని కోరారు. వారి వెంట ఝడే తాయిబాయి, శివాబాయి, సులోచన బాయి, గెడం జైతుబాయి, లక్ష్మి బాయి, ఎమునాబాయి ఉన్నారు.

గాండ్ల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా బోనాల జాతర

- ఆకట్టుకున్న పోతరాజుల విన్యాసాలు
- డబ్బు చప్పుళ్ల మోతలతో శోభాయాత్ర



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆషాడ మాసం బోనాల పండగను పురస్కరించుకొని జిల్లా కేంద్రంలో అఖిల గాండ్ల తెలికుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం భక్తి శ్రద్ధలతో ఘనంగా బోనాల జాతర వేడుకలు నిర్వహించారు. పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం నుంచి ప్రారంభమైన బోనాల శోభాయాత్ర పట్టణ పురవీధుల గుండా అశోక్ రోడ్‌లోని పెద్ద పోచమ్మ ఆలయం వరకు సాగింది. ముందుగా బోనాల కుండలను తలపై పెట్టుకొని శోభాయాత్రలో పాల్గొన్నారు. దారిపొడవునా పోతరాజుల విన్యాసాలు, డప్పు చప్పుల నడుమ డీజె పాటలకు అనుగుణంగా నృత్యాలు చేస్తూ ఉత్సాహంగా పాల్గొన్నారు. మహిళలు, యువతులు, యువకులు, చిన్నారులు పోచమ్మ తల్లి పాటలకు ఉత్సాహంగా నృత్యాలు చేశారు. కన్నుల పండువగా బోనాల జాతర జరిగింది. కార్యక్రమంలో డీసీసీబీ అధ్యక్షులు బోజారెడ్డి, బీజేపీ నాయకులు పాయల శరత్, బీసీ సంఘం అధ్యక్షుడు చిక్కాల దత్తు, ప్రధాన కార్యదర్శి కలాల శ్రీనివాస్, సామాజిక కార్యకర్త బండారి దేవన్నతో పాటు గాండ్ల సంఘం అధ్యక్షుడు రాజేష్, ప్రధాన కార్యదర్శి చందు, కులస్తులు, మహిళలు పాల్గొన్నారు.

తాంసి : ప్రతి సంవత్సరం మాదిరిగానే ఎంతో భక్తి శ్రద్ధలతో ఆషాడ మాసం బోనాలను ఆదివారం తాంసి, భీంపూర్ మండల కేంద్రాలతో పాటు మండలంలోని అన్ని గ్రామాలలో ఉన్న గ్రామ దేవతలు పోచ్చమ్మలకు గారెలు నైవేద్యాలను, మహిళలు బోనాలను సమర్పించి, పాడి పంటలు సమృద్ధిగా పంట పండి, తమ కుటుంబాలు ఆయురారోగ్యాలతో సుఖంగా ఉండాలని గ్రామ దేవతలకు తమ మొక్కులను తీర్చుకున్నారు.

ఆదిలాబాద్‌టౌన్ : తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక బోనాలు పండుగని ఎమ్మెల్యే పాయల శంకర్ పేర్కొన్నారు. ఆదివారం హైదరాబాద్ లోని నాంపల్లిలోని పోచమ్మ ఆలయంలో నిర్వహించిన బోనాల వేడుకల్లో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో వారు ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని పంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షించారు.

తలమడుగు : మండలంలోని సుంకిడి గ్రామంలో ప్రతియేటా నిర్వహించే బోనాల ఉత్సవాలకు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఎంపీ గోడం నగేష్ వేరువేరుగా హజరయ్యారు. బోనమెత్తుకొని పొచ్చమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారు మాట్లాడారు. తెలంగాణలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే బోనాల పండగ శుభకాంక్షలు తెలిపి అత్యంత భక్తి శ్రద్ధలతో కలిసిమెలిసి నిర్వహించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మహేందర్ యాదవ్, సీనియర్ నాయకుడు కనపర్తి చంద్రకాంత్, సత్యనారాయణరెడ్డి, కుంట నారాయాణ, వామన్ పటేల్, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

రహదారిపై గుంతలు పూడ్చిన పోలీసులు

నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని చించోలి(బి) గ్రామ శివారులో శ్రీ గండి రామన్న హరితవనం సమీపంలో రహదారిపై ఇటీవల కురిసిన వర్షాలకు అనేక చోట్ల రోడ్లు దెబ్బతిని గుంతలుగా ఏర్పడ్డాయి. వర్షపు నీరు చేరి ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ప్రమాదాలను నివారించేందుకు ఆదివారం రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై శ్రీకాంత్ ఆధ్వర్యంలో గుంతలను కంకరతో పూడ్చారు. తాత్కాలికంగా గుంతల రోడ్లను పూడ్చడం పట్ల ప్రజలు పోలీసులను అభినందించారు.

పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

- మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రయివేట్ సంస్థలకు ఇవ్వొద్దు
- సీఐటీయూ నాయకుల డిమాండ్



నవతెలంగాణ-ఖానాపూర్

ఎన్నికల్లో ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ అన్నారు. ఆదివారం ఖానాపూర్ పట్టణంలోని పీఆర్టీయూ భవన్‌లో మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం సీఐటీయూ ఖానాపూర్ నియోజకవర్గస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో రంగారెడ్డి జిల్లాలోని 7మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్నం భోజనం పథకాన్ని ప్రయివేట్ సంస్థలకు అప్పగించిందని, దీన్ని సీఐటీయూగా తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రయివేట్ సంస్థకు ఇచ్చే నిర్ణయాన్ని వెనక్కి తిసుకోవాలని అన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులకిచ్చే గౌరవ వేతనం, విద్యార్థులకిచ్చే మెనూ చార్జీలు పెండింగ్‌లో ఉన్నాయని, నెలల తరబడి బిల్లులు రాకపోవడంతో అప్పులు చేసి, ప్రభుత్వానికి ఎదురు పెట్టుబడి పెట్టి, వంట చేసి పెడుతున్నారన్నారు. దీంతో కార్మికులు అప్పుల పాలవుతున్నారని, తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేక ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా పిల్లలకిచ్చే మెనూ చార్జీలు పెంచడం లేదన్నారు. వేతనాలు పెరగకపోగా, ఉన్న వేతనాలు కూడా నెలల తరబడి పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కార్మికులకు ఇచ్చే వేతనమే తక్కువగా ఉంది. అది కూడా రాకపోవడంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారనీ ప్రస్తుతం కేటాయించిన బడ్జెట్ పాత మెనూకే సరిపోవడం లేదన్నారు. మెనూ చార్జీలు పెంచాలని, కార్మికుల పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేసి, కార్మికుల వ్యక్తిగత ఖాతాల్లోనే వేయాలన్నారు. 3 కోడిగుడ్లు పెట్టాలని, రాగి జావ పోయాలని ఒత్తిడి చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన యూనియన్ జిల్లా కార్యదర్శి కె.రాధ, నాయకులు లక్ష్మి, మంజుల, రజిత, సరిత, గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తొడసం.శంభూ పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను అప్పజెప్పాలి

నవతెలంగాణ-భైంసా

మౌళిక వసతులు కల్పించి, తమకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను అప్పచెప్పాలని డిమాండ్ చేస్తూ, భైంసా డబుల్ బెడ్‌రూమ్ లబ్దిదారులు చేపట్టిన నిరసన దీక్షలు ఆదివారం నాటికి ఏడో రోజుకు చేరుకున్నాయి. ప్రభుత్వం, ప్రజాప్రతి నిదులు, అధికారులపై ఒత్తిడి తీసుకవచ్చి తమ సమస్యను పరిష్కరించుకునేందుకు లబ్దిదారులు రోజుకో రీతిలో ఆందోళనలు చేపడుతున్నారు. అందులో భాగంగానే ఆదివారం లబ్దిదారులు ముథోల్ ఎమ్మెల్యే రామారావ్ పటేల్ క్యాంపు కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం ఎమ్మెల్యేను కలిసి తమ గోడును వినిపించారు. ఎడాది కాలం కింద లక్కీ డ్రా ద్వారా లబ్దిదారులుగా ఎంపికైన తమకు ఇండ్లను కేటాయించకుండా తీరని అన్యాయం చేస్తున్నారంటూ వాపోయారు. అద్దెలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరితగతిన సమస్యను పరిష్కరించేందుకు బాధ్యతాయుతమైన చర్యలు చేపడుతానని వెల్లడించారు. అసెంబ్లీ సమావేశాలు ముగిసిన అనంతరం అధికారంతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయించి, సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తానని సముదాయించారు. దీంతో శాంతించిన లబ్దిదారులు అక్కడి నుంచి తమ తమ ఇండ్లకు తిరిగి వెళ్లిపోయారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

నవతెలంగాణ-సిరికొండ

ఇటీవల ఉత్తరప్రదేశ్‌లో హావల్దారుగా విధులు నిర్వహిస్తూ, మృతి చెందిన ఆర్మీ జవాన్ రాజేశ్వర్, అలాగే మాజీ ఉపసర్పంచ్ తోకల చందు తండ్రి రాజన్న అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆదిలాబాద్ ఎంపీ నగేష్ ఆదివారం ఆ కుటుంబాలను పరామర్శించారు. తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ అమృత్‌రావ్, బీజేపీ మండలాధ్యక్షుడు అమూల్ నాయకులు బాలాజీ, లక్ష్మణ్, మల్లేష్ పాల్గొన్నారు.

ఇచ్చోడ : మండలం కేంద్రానికి చెందిన మాజీ ఎంపీటీసీ కళ్లెం దయాకర్‌రెడ్డి ఇటీవల గుండెపోటుతో మరణించిన విషయం తెలుసుకున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆదివారం కుటుంబ సభ్యులను పరామర్శించారు. కళ్లెం దయాకర్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వెంట మండల నాయకులు ఏనుగు కృష్ణారెడ్డి, ముండే పాండురంగ్, శివారెడ్డి, గాడ్గే సుభాష్, లోక శిరీష్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, నారాయణరెడ్డి ఉన్నారు.

రెంకొని వాగు అప్రోచ్ రోడ్డు మరమ్మత్తులు చేపట్టాలి

నవతెలంగాణ-ఖానాపూర్

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఖానాపూర్‌లోని రెంకొని వాగు అప్రోచ్ రోడ్డు కొట్టుకుపోయిందని, అటువైపు వెళ్లే గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, మరమ్మతు పనులు వెంటనే చేపట్టాలని ఎంసీపీఐ(యూ) నిర్మల్ జిల్లా కార్యదర్శి పీటర్ అన్నారు. ఆదివారం ఖానాపూర్ పట్టణంలోని విశ్రాంతి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖానాపూర్ నుంచి ఎల్లాపూర్, ఖానాపూర్ నుంచి తర్లపాడు గ్రామాలకు వెళ్లే ప్రజలకు రెంకొనివాగు బ్రిడ్జి, అప్రోచ్ రోడ్డు కొట్టుకుపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడిందన్నారు. పెంబి, కడెం, దస్తురాబాద్, ఖానాపూర్, మండలాల ప్రజలు వాగు దగ్గరిదాకా వచ్చి రిటర్న్ తిరిగిపోతున్నారనీ అన్నారు. వంతెన పనులు సరియైన సమయంలో పూర్తి చేసి ఉంటే ప్రజలకు ఇటువంటి పరిస్థితులు ఏర్పడి ఉండేవి కావన్నారు. తక్షణమే ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి, రెండు రోడ్ల నుంచి ప్రజల రాకపోకలు నడిచే విధంగా ఏర్పాట్లు చేయాలని అన్నారు. ఈ సమావేశంలో ఎంసీపీఐ(యూ) నిర్మల్ జిల్లా సహాయ కార్యదర్శి భూక్య సురేందర్, అఖిలాభారత మహిళ సమైక్య జిల్లా కార్యదర్శి మద్దుల స్వరూప, నిర్మల్ పట్టణ కార్యదర్శి గణేష్ పాల్గొన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
సోమవారం | జులై 29, 2024 | www.navatelangana.com

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-రెబ్బెన



పేదవారికి వైద్య సౌకర్యం కోసం సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే కోవ లక్ష్మి తన క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. మండలంలోని గుండి గ్రామానికి చెందిన కొట్రంగే రాంబాయికు రూ.19వేలు, బట్టుపెల్లి శ్రీనివాస్ రూ.24000, రాంక రాజుమాల్ రూ.22000 చెక్కులను మాజీ సర్పంచ్ జబరి అరుణ, రవీందర్‌తో కలిసి బాధితులకు అందజేశారు. వీరితో పాటు ఆసిఫాబాద్, రెబ్బెన సింగిల్ విండో చైర్మన్లు అలిబిన్ అహ్మద్, కర్నతం సంజీవ్, మాజీ ఎంపీపీ జుమ్మిడి సౌందర్య ఆనంద్, మాజీ ఎంపీటీసీ సంగెం శ్రీనివాస్, రవీందర్, మదనయ్య పాల్గొన్నారు.

లయోలా సంస్థ ఆధ్వర్యంలో గిరి యువతకు శిక్షణ

నవతెలంగాణ-కెరమెరి



కుమురం భీం పోరు గ్రామాల యువతీ యువకులకు ఆదివారం భారత సామాజిక సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ ఏర్పాటు చేయడం జరిగింది. సామజిక అంశాలు, సాంస్కృతి, సామాజిక తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా లయోలా సంస్థ కరస్పాండెంట్ మాట్లాడుతూ గిరిజన యువత అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. శిక్షణాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ మాజీ చైర్మన్ పెందూర్ రాజేశ్వర్, సభ్యులు పాల్గొన్నారు.

నేటి సింగరేణి పరిరక్షణ యాత్రను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-రెబ్బెన

బొగ్గు బ్లాక్‌లు సింగరేణికి కేటాయించాలని సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో 29 నుంచి చేపట్టే సింగరేణి పరిరక్షణ యాత్రను విజయవంతం చేయాలని సీపీఐ(ఎం) పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం దినకర్ కోరారు. ఆదివారం మండలంలోని గోలేటి టౌన్‌షిప్‌లో గల సీఐటీయూ కార్యాలయంలో యాత్రకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలోని బొగ్గు బ్లాకులను సింగరేణికే నేరుగా కేటాయించాలనీ, వేలం పాటను ఆపాలని డిమాండ్ చేస్తూ ఈనెల 29 నుంచి సింగరేణి పరిరక్షణ యాత్రను చేపడుతున్నట్టు తెలిపారు. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో తమ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం యాత్రను ప్రారంభిస్తారని, వచ్చేనెల ఐదో తేదీ వరకు ఎనిమిది రోజులపాటు ఈ బస్సుయాత్ర కొనసాగుతుందని తెలిపారు. పోరాట చరిత్ర ఉన్న తెలంగాణ ప్రజలు, కార్మికులు సింగరేణిని కాపాడుకోవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు గొడిసెల కార్తిక్, జె.రాజేందర్, నాయకులు కృష్ణమాచారి పాల్గొన్నారు.

మారుమూల గ్రామాలకు రోడ్డు వసతి కల్పించాలి



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండలంలోని మారుమూల గ్రామాలైన జిల్లెడ, మురళీగూడ, కమ్మర్‌గాం గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు కోట సతీష్ కోరారు. ఆదివారం పంచాయతీ రాజ్ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కను కలిసి రోడ్డు సమస్యపై విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం హైదరాబాద్ ప్రజాభవన్‌లో ఉమ్మడి జిల్లా ఆదివాసీ సంఘాలతో మంత్రితో సమావేశం కాగా సిర్పూర్ నియోజకవర్గంలోని సమస్యలను వివరించినట్టు ఆయన తెలిపారు. అధిక వర్షాల వల్ల ప్రాణహిత పరివాహక ప్రాంతాల రైతులు ప్రాణహిత బ్యాక్ వాటర్‌తో పొలాలు పూర్తిగా మునిగినట్టు, నష్టపోయిన రైతులకు పరిహారం వచ్చే విధంగా చూడాలని, రోడ్డు సౌకర్యం లేక మారుమూల గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్టు, ఆదివాసులపై అటవీ శాఖ అధికారుల దాడులపై చర్యలు తీసుకోవాలని కోరగా కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేస్తామని హామీ ఇచ్చినట్టు తెలిపారు.

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-కౌటాల

గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని గ్రామపంచాయతీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెరిక శ్రీకాంత్ అన్నారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో ఆదివారం మండల మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని ప్రతినెల గ్రాంట్ ద్వారా ఒకటో తారీకు వేతనాలు చెల్లించాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని, పర్మనెంట్ చేయాలని రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు 30న ఛలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. జిల్లాలోని గ్రామ పంచాయతీ సిబ్బంది సభకు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఇంద్ర పార్క్ వద్ద జరిగే సభను చూసి ప్రభుత్వం కళ్ళు తెరిచి సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ యూనియన్ జిల్లా అధ్యక్షులు మోరేశ్వర్, జిల్లా నాయకులు నగేష్, మండల్ కమిటీ నాయకులు ప్రకాష్, శంకర్, నాని, గణపతి పాల్గొన్నారు.

పార్కింగ్ స్థలం ఏర్పాటు చేసి ఫైన్ వేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలో పార్కింగ్ స్థలం ఏర్పాటు చేసిన తర్వాత పోలీసులు వాహనాలకు అపరాధ రుసుములు వేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కార్తీక్ అన్నారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జిల్లా కేంద్రానికి వివిధ పనుల నిమిత్తం వస్తున్న వారికి వాహనాలు నిలుపుకోవడానికి సరైన స్థలం లేదన్నారు. పోలీసులు మాత్రం ఇదేది గుర్తించకుండా అడ్డగోలుగా వాహనదారులకు ఫైన్ వేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. వెంటనే పార్కింగ్ స్థలాన్ని ఏర్పాటు చేసి వాహనదారుల కష్టాలు తీర్చాలని డిమాండ్ చేశారు.

నెలాఖరు నాటికి లక్ష్యం పూర్తి చేయాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జులై నెలాఖరు నాటికి జిల్లాలో వన మహోత్సవంలో భాగంగా నిర్ధయించిన 53 లక్షల మొక్కలు నాటే లక్ష్యాన్ని చేరుకునేలా ప్రయత్నాలు చేస్తున్నట్లు కలెక్టర్ వెంకటేష్ ధోత్రే తెలిపారు. ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం పురస్కరించుకొని వన మహోత్సవంలో భాగంగా జిల్లా కేంద్రంలోని పీటీఈ కళాశాలలో జిల్లా అటవీశాఖ అధికారి నీరజ్ కుమార్ టిబ్రేవాల్ అధ్యక్షతన నిర్వహించిన వన మహోత్సవ కార్యక్రమానికి అడిషనల్ కలెక్టర్ దీపక్ తివారి, అదనపు ఎస్పీ ప్రభాకర్ రావు, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, డీటీడీఓ రమాదేవి, మున్సిపల్ కమిషనర్ భుజంగరావుతో కలిసి ముఖ్యఅతిథిగా హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వనమహోత్సవంలో భాగంగా 53 లక్షల లక్ష్యాన్ని నిర్ధయించుకున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు 50 శాతానికి పైగా మొక్కలు నాటినట్లు వివరించారు. ప్రస్తుత అనుకూల వాతావరణంలో భాగంగా ఈ నెలాఖరు నాటికి లక్ష్యం పూర్తిచేసేలా ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని రోడ్లకు ఇరువైపులా, అన్ని కార్యాలయాల్లో మొక్కలు నాటేలా చర్యలు తీసుకున్నట్లు, నాటిన మొక్క బతికేలా చూడాలన్నారు. మన నాటిన మొక్క భవిష్యత్తు తరాలకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ప్రభుత్వం పథకాన్ని విజయవంతం చేయడానికి ప్రతి ఇంటికి 6 మొక్కలు అందిస్తున్నట్లు తెలిపారు. దీనిలో ప్రతిరోజు ఇంట్లో ఉపయోగపడే కరివేపాకు లాంటి వాటిని అందజేస్తున్నామన్నారు. మొక్కల పెంపకంపై ప్రజల్లో ఇప్పటికే అవగాహన కల్పిస్తున్నామని ప్రజలను ఆ దిశగా సిద్ధం చేస్తున్నామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మీ మాట్లాడుతూ మొక్కలు ప్రతి ఒక్కరు నాటాలని సూచించారు. తమ ప్రభుత్వ హయాంలోనే హరితహారం పేరుతో పెద్ద ఎత్తున మొక్కలు నాటినట్లు తెలిపారు. ఆ సంస్కృతిని ప్రతి ప్రభుత్వం కొనసాగించాలని, అప్పుడే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందన్నారు. అంతకు ముందు ముఖ్య అతిథులకు విద్యార్థుల ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆసిఫాబాద్ రేంజ్ అధికారి అప్పలకొండ, డిప్యూటీ రేంజ్ అధికారి యోగేష్, సీఐ సతీష్, జీసీడీఓ శకుంతల, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



ఆసిఫాబాద్ : మొక్కలు నాటి నీరు పోస్తున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, ఎమ్మెల్యే కోవ లక్ష్మీ

బెజ్జూర్ : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల ప్రాంగణంలో ఆదివారం బెజ్జూర్ రేంజ్ అధికారి దయాకర్ ఆధ్వర్యంలో వన మహోత్సవంలో తెలంగాణ రాష్ట్ర హైదరాబాద్ దులపల్లి ఫారెస్ట్ అకాడమీ అసిస్టెంట్ డైరెక్టర్ రామ్మోహన్ రావు పాల్గొని మొక్కలునాటారు. శిక్షణ బీట్ అధికారులను రేంజ్ పరిధిలోని అడవీ ప్రాంతాన్ని రేంజ్ అధికారి దయాకర్, రామ్మోహన్ సిబ్బందితో కలిసి పరిశీలించారు. వన్యప్రాణుల కదలికలు, పులుల పాదముద్రలు, రాముడు, భీముడు చెట్లతో పాటు గడ్డి క్షేత్రాలను పరిశీలించారు. అటవీ ప్రాంతంలో రకరకాల పక్షులు, వన్యప్రాణులు, అటవీ సంపద గురించి వివరించారు. అనంతరం జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల ప్రాంగణంలో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి శ్రావణ్ కుమార్, ఈసీ రజనీకాంత్, తోటమాలి సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రామకృష్ణ, బీట్ అధికారి అనిత, గ్రామ కార్యదర్శి తుకారం, నాయకులు సామల తిరుపతి, జావిద్ అలీ, విద్యార్థులు పాల్గొన్నారు.

తిర్యాణి : చెట్టు ప్రతి జీవకోటి మనుగడకు ఆధారమని మాజీ ఎంపీపీ శ్రీదేవి, అటవీ శాఖ అధికారులు శ్రీనివాస్, ప్రవీన్‌కుమార్ అన్నారు. ఆదివారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి జీవకోటి మనుగడ సాగించాలంటే సమాజంలో ప్రతి ఒక్కరు చెట్లు నాటి వాటిని పరిరక్షించే బాధ్యత వహించాలని వారు తెలిపారు. మండలంలో మొత్తం 2.33 లక్షల మొక్కలు నాటే లక్ష్యం ఉందన్నారు. అందులో ఇప్పటివరకు 1.77 లక్షల మొక్కలు నాటడం జరిగిందన్నారు. మిగిలిన 38 వేల మొక్కలను త్వరలోనే నాటి పూర్తిచేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రాజ్యలక్ష్మి, గిన్నెదరి ఇన్‌చార్జి రేంజ్ అధికారి ప్రవీణ్‌కుమార్, డిప్యూటీ రేంజ్ అధికారి సంతోష్, అటవీ శాఖ అధికారులు మహేందర్, సూర్యనారాయణ, శ్రీనివాస్, నరేష్, రాంసింగ్, బీట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్ : ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని ఎంపీడీఓ అల్బర్ట్ అన్నారు. మండలంలోని ఎలుకపెల్లి అంగన్‌వాడీ కేంద్రంలో వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి ప్రభాకర్, ఏపీఓ సతీష్, అంగన్‌వాడీ సిబ్బంది శ్రీలత, ఫారెస్టు బీట్ అధికారులు, పోలీస్ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

వాంకిడి : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో వనమహోత్సవంలో భాగంగా తహసీల్దార్ రియాజ్ అలీ, ఎంపీడీఓ నజ్రుల్ ఉల్లాఖాన్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడాలంటే కాలుష్యాన్ని నివారించడానికి ప్రతి ఒక్కరు ఒక్కో మొక్కలు నాటాలని, కళాశాల, పాఠశాలలో కూడా మొక్కలు నాటాలని, దీనికి అందరు సహకరించి వనమహోత్సవాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మెన్ జాబిరె పెంటు, ఏపీఓ శివకుమార్, ఏపీఎం మహేష్, ఎంపీఓ ఖాజా అజయొద్దీన్, కార్యదర్శులు, ఆశ్రమ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

కెరమెరి : నాటిన మొక్కలను సంరక్షించాలని ఎఫ్ఆర్ఓ మజారుద్దీన్ అన్నారు. ఆదివారం మండలంలోని మోడీ ఆశ్రమ పాఠశాలలో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటిన మొక్కలను సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అంజాద్ పాషా, మాజీ జడ్పీటీసీ సెడ్మాకి ద్రుపతాబాయి, విద్యార్థినిలు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

రెబ్బెన : విద్యార్థి దశనుండే మొక్కలు నాటడంపై అవగాహన కల్పించాలని అవే భావితరాలకు ప్రాణ రక్షాని ఇన్‌చార్జి ఎఫ్ఆర్ఓ శ్రీధర చారి అన్నారు. మండల కేంద్రంలోని గంగాపూర్ వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. అడవులను కాపాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శంకరమ్మ, సెక్షన్ అధికారి ఎం.కోమ్మలు, ఏ.రవీందర్, ఫారెస్ట్ బీట్ అధికారులు స్వాతి, శ్రీలత, ఏపీఓ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



బెజ్జూర్



వాంకిడి



తిర్యాణి



పెంచికల్‌పేట్

రైతు బీమా దరఖాస్తుకు వేళాయే

- ఆగస్టు 5 వరకు అవకాశం



బీమా కోసం దరఖాస్తు చేసుకుంటున్న రైతు(ఫైల్)

నవతెలంగాణ-తిర్యాణి

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు బీమా పథకం అన్నదాతల కుటుంబాలకు అండగా ఉంటుంది. రైతు అకాల, సహజ మరణం చెందితే ఆయన కుటుంబం వీధిన పడొద్దనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకొచ్చింది. ప్రభుత్వమే జీవిత బీమా సంస్థ(ఎల్ఐసీ)కు ప్రీమియం చెల్లించి మృతి చెందిన రైతు కుటుంబాలకు ప్రమాద బీమా సొమ్మును అందిస్తుంది. ఏటా ప్రభుత్వమే రెన్యూవల్ చేస్తుంది. ఈ సంవత్సరం జూన్ 28వ తేదీ వరకు పట్టాదారు పాసు పుస్తకం కలిగి ఉన్న వారు కొత్తగా రైతు బీమాకు దరఖాస్తు చేసుకొనేందుకు ఆగస్టు 5వ తేదీ వరకు అవకాశం కల్పించింది. గతంలో దరఖాస్తు చేసుకున్న రైతులు తమ ఆధార్, బ్యాంకు ఖాతాలో మార్పులు లేదా నామిని చనిపోతే పేరు మార్పు కోసం ఈ నెల 30 వరకు దరఖాస్తు చేసుకోవాలి.

దరఖాస్తు ఈ విధంగా చేసుకోవాలి...

వ్యవసాయ భూమి కొనుగోలు చేసినా లేక తమ పేరిట భూమి మార్పిడి చేసుకున్న వ్యవసాయ భూమిని ధరణిలో పట్టా చేయించుకున్న రైతులు 18 ఏండ్ల నుండి 59 ఏండ్లలోపు వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. 1965 ఆగస్టు 14వ తేదీ నుండి 2006 ఆగస్టు 14వ తేదీ మధ్యలో జన్మించిన రైతులు అర్హులు. పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్‌కార్డు, నామిని ఆధార్‌కార్డు జిరాక్స్ ప్రతులతో కలిపి రైతు బీమా ఫారంలో వివరాలు నమోదుచేసి పట్టాదారు స్వయంగా సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారికి అందజేసి నమోదు చేసుకోవాలి.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

నవతెలంగాణ-కౌటాల



రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలోని సదాశివపేటలో చోటు చేసుకుంది. ఎస్సై ఎన్.మధుకర్ తెలిపిన వివరాల ప్రకారం తక్కల్లపెల్లి అంజన్న(21) తన మిత్రుడు విజయ్‌తో కలిసి శనివారం సాయంత్రం కారులో డోర్‌పెల్లికి ఓ పూజారిని తీసుకెల్లడానికి వెల్లి అక్కడి నుండి చింతలమానెపల్లి మండలం గూడెంవెల్లి అక్కడి నుండి డోర్‌పెల్లికి వచ్చి తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో ముత్తంపేట్ సమీపంలో రాత్రి 8 గంటల ప్రాంతంలో సిర్పూర్-టి, కౌటాల ప్రధాన రహదారిపై అజాగ్రత్తగా అతివేగంగా వచ్చి చెట్టును ఢీకొట్టాడు. కారులో ఉన్న ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అంబులెన్స్‌లో క్షతగ్రాతులను సిర్పూర్ ఆస్పత్రికి తరలించారు. అంజన్న తండ్రి తక్కల్లపెల్లి శ్రీనివాస్ రాత్రి 9 గంటలైనా అంజన్న ఇంటికి రాకపోవడంతో ఫోన్ చేశారు. స్థానికులు మాట్లాడి విషయం చెప్పారు. వెంటనే తల్లిదండ్రులు అక్కడికి వెళ్లి వైద్యుల సూచన మేరకు కాగజ్‌నగర్‌లోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు పరిక్షించి చనిపోయినట్లు చెప్పారు. మృతుని తండ్రి తక్కల్లపెల్లి శ్రీనివాస్ ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మధూకర్ తెలిపారు.

ఘనంగా బోనాల పండుగ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆషాడ మాస బోనాల సందర్భంగా ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రజలు పెద్ద ఎత్తున బోనాల పండుగ నిర్వహించారు. ఉదయం నుండి జిల్లా కేంద్రంలోని పోచమ్మ, మైసమ్మ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు మూకుమ్మడిగా బోనాలు నెత్తిన పెట్టుకొని అమ్మవారికి సమర్పించారు. బోనాల పండుగతో జిల్లా కేంద్రంలోని సందీప్‌నగర్‌తో పాటు పలు కాలనీల్లో సందడి నెలకొంది.

కౌటాల : ఆషాఢ మాసం బోనాల పండగను ఘనంగా మహిళలు జరుపుకున్నారు. మండలంలోని వీర్దండి గ్రామంలో మహిళలు ఆషాఢ మాసం బోనాలు ఊరిలో ఉన్న పోచమ్మకు సమర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మడావి రేణుక బోనమెత్తి మొక్కులు చెంల్లించుకొని ప్రతి సంవత్సరం భక్తి శ్రద్ధలతో ఊరంతా కలిసి ఊరి పోచమ్మకు బోనాలు సమర్పించుకుంటామన్నారు. పాడి పంట బాగుండాలని వర్ష కాలంలో సీజనల్ వ్యాధులు రాకుండా ఉండాలని మొక్కుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రెబ్బెన : మండలంలో రేణుక ఎల్లమ్మ బోనాలు పండుగను ఘనంగా నిర్వహించారు. శ్రీ రేణుక ఎల్లమ్మ బోనాలు మెయిన్ రోడ్ మార్గాన గుడి వద్దకు ఆటపాటలతో తీసుకెళ్లి సమర్పించారు. పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు, మహిళలు పాల్గొన్నారు.



ఆసిఫాబాద్



రెబ్బెన

ప్రజారోగ్యానికి పెద్దపీట వేయాలి

- ఎమ్మెల్యే కోవ లక్ష్మి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రభుత్వం ప్రజా ఆరోగ్యానికి పెద్దపీట వేయాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. ఆదివారం క్యాంప్ కార్యాలయంలో సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనారోగ్యంతో ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స చేసుకున్న ప్రజలకు ఆర్థికంగా ఆదుకునేందుకు మరింత చొరవ చూపాలని కోరారు. రూ.లక్షల్లో ఖర్చుపెడితే వేళల్లో ప్రభుత్వం మంజూరు చేయడం దారుణమన్నారు. బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం ప్రభుత్వం పాటుపడాలన్నారు. ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స చేసుకున్న బిల్లులపై కనీసం 70శాతం అయినా మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంతకు ముందు జిల్లా కేంద్రంలోని దస్నాపూర్‌లో పోచమ్మలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేసి నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని పంటలు సమృద్ధిగా పండాలని మొక్కుకున్నారు. కార్యక్రమంలో సింగల్ విండో చైర్మెన్లు అలీబిన్ హైమద్, కర్నాదం సంజీవ్, పార్టీ మండల అధ్యక్షుడు జాబరే రవీందర్, మాజీ జెడ్పీటీసీ అజయ్, మాజీ ఎంపీపీ సౌందర్య, ఏఎంసీ మాజీ చైర్మెన్ వనజా, మాజీ సర్పంచ్లు బి.భీమేష్, శ్రీనివాస్, కిష్టయ్య, అయ్యూబ్ పాల్గొన్నారు.



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-వేమనపల్లి



మండలంలోని నీల్వాయి గ్రామంలో రూ.1,94,500 విలువ గల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆదివారం మాజీ జడ్పీటీసీ రుద్రబట్ల సంతోష్ కుమార్, కాంగ్రెస్ అధ్యక్షుడు సయ్యద్ సాబీర్ అలీతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షాన, ప్రజా పాలన చేస్తుందని అన్నారు. సంక్షేమపథకాలు సక్రమంగా అందేలా స్థానిక ఎమ్మెల్యే గడ్డం వినోద్ ప్రత్యేక చొరవతో నిరుపేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నీల్వాయి మాజీ సర్పంచ్ గాలి మధు, పూర్ణ చంద్రరెడ్డి, పి.తిరుపతి రెడ్డి, వైస్ ఎంపీపీ ఒడిల రాజన్న, చెన్నూరి పురుషోత్తం, తోకల రామచంద్రం, ఆవులమారి పున్నం, కుబిడే కిష్టయ్య, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మురుగు కాలువలను నిర్మించాలి

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని మొర్రిగూడ గ్రామపంచాయతీ పరిధిలోని తిర్మన్‌గూడలో మురికి కాలువలు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. మురికి కాలువలు లేకపోవడంతో కురుస్తున్న వర్షాలకు, నీరు రోడ్లపైకి వచ్చి ఇళ్లలోకి చేరుతున్నాయని, దీంతో ఈగలు దోమలతో డెంగు లాంటి ప్రాణాంతకరమైన వ్యాధులు సంభవించే ప్రమాదాలు ఉన్నాయని గ్రామస్తులు సతీష్ ప్రకాష్ శోభా నాయక్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రత్యమ్నాయ మార్గం చూపించండి

- ఎమ్మెల్యే వివేక్‌ను కలిసిన గుత్తెదార్‌పల్లి గ్రామస్థులు



నవతెలంగాణ-జైపూర్

శ్రీరాంపూర్ ఓపన్‌కాస్ట్ గని ఏర్పాటుతో నివాస గృహాలు నష్టపోయిన మాకు ప్రత్యమ్నాయ మార్గం చూపించాలని రామారావుపేట్ గ్రామ పంచాయతి గుత్తెదార్‌పల్లికి చెందిన బాధితులు కోరారు. ఆదివారం చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామిని కలిసి గ్రామస్తులు రమేష్, నామాల తిరుపతి వినతి పత్రం అందజేశారు. శ్రీరాంపూర్ ఓపన్‌కాస్ట్ గని ముంపుకు గురైన గుత్తెదార్‌పల్లి గ్రామాన్ని ఖాళీ చేయించిన సింగరేణి యాజమాన్యం అందరితో పాటు మాకు ప్రత్యమ్నాయం చూపించకపోవడం బాధాకరమని తెలిపారు. అందరితో పాటు మాకు నష్టపరిహారం చెల్లించి మార్గం చూపించకుండా 25 కుటుంబాలను నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేధన వ్యక్తం చేశారు. మిగితా వారితో పాటు మేము కూడా అర్హులమే అయినప్పటికీ చిన్న చితక కారణాలు చూపించి మా కుటుంబాలను అనర్హులుగా వేరు చేయడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఓపన్‌కాస్ట్ తవ్వకాల మధ్య మగ్గుతున్నామని తెలిపారు. బ్లాస్టింగ్ సమయంలో దుమ్ముధూళి, బండరాలు వచ్చి మా ఇండ్లపై పడుతుండగా నీటి వసతి, రోడ్డు సౌకర్యం లేక నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. గుత్తెదార్‌పల్లి మాదిరిగా సింగాపూర్ గ్రామాన్ని కూడ ఖాళీ చేయించిన సింగరేణి యాజమాన్యం తీరును ఎమ్మెల్యే వివేక్‌కు వివరించారు. నష్టపరిహారం ఇవ్వకపోయినా ఇంటి స్థలాలు చూపించినా వెళ్లిపోతామని అభ్యర్థిస్తున్నా సింగరేణి అధికారలు నిర్లక్ష్యం చేస్తున్నారని, సింగరేణి క్వాటర్లు పర్మనెంట్‌గా మాకు అప్పగించినా గ్రామాన్ని ఖాళీ చేసి వెలుతామని అన్నారు. సింగరేణి అధికారులతో మాట్లాడి మాకు న్యాయం చేయాలని కోరారు. బాధితుల సమస్య పట్ల స్పందించిన ఎమ్మెల్యే వివేక్ మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్‌తో ఫోన్‌లో మాట్లారు.

ఘనంగా పోచమ్మ బోనాలు

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని సోమగూడెం(కె) గ్రామంలో ఆదివారం పోచమ్మ బోనాల జాతర అంగ రంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున బోనాలతో అమ్మ వారి దేవాలయంకు చేరి బోనాలను సమర్పించారు. అమ్మవారి బోనాలు పట్నాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ తాజా మాజీ సర్పంచ్ సపాట్ శంకర్ మాట్లాడుతూ గత మూడేళ్లుగా అమ్మవారి గుడి ఏర్పాటు చేసుకుని ప్రతి సంవత్సరం ఆషాడ మాసంలో బోనాల జాతర పండుగ వాతావరణంలో ప్రజలందరూ కలిసి నిర్వహిస్తున్నామని, అదే విధంగా గ్రామంలో అమ్మవారి ఆశీస్సులు ఉండాలని ప్రజలందరూ సుఖశాంతంతో ఉండాలని మొక్కలు చెల్లించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో భోగె సతీష్, మర్రి సంతోష్, పత్తిపాక మొగిలి, తోడేటి కృష్ణ, బూడిది రమేష్, దాగం రాయలింగు, మెరుగు తిరుపతి, చింతాజీ సత్తయ్య, భూక్య చందులార్, సభావత్ రాజుగ, భూక్య విజయ నాయక్, సబబావత్ రాయమల్లు, దాగం దేవాజీ, పెంటపర్తి ప్రశాంత్, మల్యాల సంపత్, శ్రీను, చిలుముల శంకర్ పాల్గొన్నారు.

సేవాలాల్ సేన రాష్ట్ర మహాసభల కరపత్రాల విడుదల

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని సోమగూడెంలో సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు గుగులోత్ మల్లేష్ నాయక్, రాష్ట్ర కోకన్వీనర్లు అజ్మీర తిరుపతి నాయక్, జాదవ్ గజానంద్, బానోత్ సరోజ బాయ్ ఆధ్వర్యంలో ఆగస్టు 9న జరిగే సేవాలాల్ సేన రాష్ట్ర మహాసభ కరపత్రాలను ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం బంజారాలను గౌరవించి మంత్రి పదవి కేటాయించాలని, నామినేటెడ్ పదవుల్లో సముచిత స్థానం కల్పించాలని, 10 శాతం గిరిజన రిజర్వేషన్ పెంపును చట్ట బద్దత కల్పించి అన్ని రంగాల్లో అమలు చేయాలని కోరారు. సేవాలాల్ సేన రాష్ట్ర మహాసభలకు జిల్లాలోని బంజారాలు తరలి వచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బానోత్ శంకర్, బానోతు రాజు, భూఖ్య కుమార్, అజ్మీర దేవ్ సింగ్, నగవత్ కిషన్, పున్నం తిరుపతి పాల్గొన్నారు.

ఘనంగా గంగమ్మతల్లి బోనాలు



నవతెలంగాణ-హాజీపూర్

మండలంలోని ముల్కల్ల గ్రామ గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో ఆదివారం గంగమ్మతల్లి బోనాల జాతర ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని గంగపుత్ర సంఘ భవనం నుంచి డప్పుళ్ల చప్పుళ్ల, డీజే మోతలతో గంగపుత్రుల చేపల వల, చేపల వేట పనిముట్లతో శోభాయాత్రగా గోదారమ్మ నదీ తీరానికి చేరుకున్నారు. గోదారమ్మకు పూజలు చేసిన అనంతరం పసుపు, కుంకుమలతో మొక్కులు సమర్పించి పూలమాలలతో బోనాలు సమర్పించారు. పిల్లా, పాపలను ప్రతీ ఒక్కరినీ చల్లంగా చూడాలని గంగమ్మతల్లిని వేడుకున్నారు. కనుల పండవగా జరిగిన జాతరలో గంగపుత్ర సంఘం అధ్యక్షుడు బోరె లింగయ్య, స్థానిక పెద్దలు ధర్మాజీ అర్జయ్య, శెట్టిపల్లి మల్లయ్య, బోరె అంజయ్య, గారె తిరుపతి, గుమ్ముల భీమయ్య, ధర్వాజ రాజేందర్, వెంకటేశ్, రమేశ్, రాజలింగు పాలొన్నారు.

రోడ్డు మైసమ్మకు ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని కలమడుగు గ్రామంలో గోదావరి నది ఒడ్డున నూతనంగా నిర్మించిన రోడ్డు మైసమ్మ ఆలయంలో ఆదివారం ఫోర్ వీలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు నిలేష్, రాజన్న, మల్లేష్ మాట్లాడుతూ రోడ్డు ప్రయాణాలు సాఫీగా సాగాలని, మైసమ్మ దేవి ఆశీస్సులు తమపై ఉండాలని ప్రత్యేక మొక్కలు చెల్లించామన్నారు. ప్రతి ఏడు ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. ఫోర్ వీలర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

వ్యవ 'సాయ' మేది..?

- జిల్లాలో అధికారుల కొరత
- తరచూ సస్పెన్షన్లు, డిప్యూటేషన్లతోనే..
- పర్యవేక్షణ లేక నష్టపోతున్న రైతులు



నవతెలంగాణ-హాజీపూర్

జిల్లాలో వ్యవసాయాధికారుల కొరత ఏర్పడింది. రెండు వ్యవసాయ డివిజన్ (మంచిర్యాల,చెన్నూర్) జిల్లా కార్యాలయానికి ఇన్‌చార్జీలే కొనసాగుతున్నారు. ప్రస్తుతం ఖరీఫ్ వానాకాలం సీజన్ ప్రారంభం అయిన నేపథ్యంలో కార్యాలయ పరిపాలన, సిబ్బందితో పర్యవేక్షించాల్సిన అధికారులు లేకుండా పోయారు. ఆయా డివిజన్ పరిధిలో వానాకాలం సాగు ప్రణాళిక, విత్తనాలు, ఎరువులు, రైతులకు పంట మార్పిడి, సేంద్రియ ఎరువుల వినియోగం తదితర సూచనలు, సలహాలు ఇవ్వాల్సి ఉంది. కింది స్థాయి సిబ్బందితో సమావేశాలు నిర్వహించాల్సి ఉంది. భారీ వర్షాలతో పంటనష్టాలు జరిగే అవకాశముంది. మరో పది రోజుకు భారీ వర్షాలు కురిసే అవకాశం వుంది. ఎరువుల వినియోగం పక్కదారి పడుతోందని, దాన్ని అరికట్టాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. రెగ్యులర్ జిల్లా వ్యవసాయాధికారి (డీఏఓ) కల్పన కొంత కాలంగా అనారోగ్యం కారణంగా మూడు నెలలుగా లీవ్‌లో వుండి శుక్రవారం తిరిగి బాధ్యతలు తీసుకున్నారు. జిల్లాలో చెన్నూర్, భీమిని, బెల్లంపల్లి, మంచిర్యాల డివిజన్లతో పాటు అదనంగా జిల్లా వ్యవసాయ కార్యాల యంలో ఒక ఏడీఏ మొత్తం ఐదుగురు ఏడీఏలు ఉండాలి. కానీ ప్రస్తుతం ఒక్క భీమిని, బెల్లంపల్లి డివిజన్‌లో రెగ్యులర్ ఏడీఏలు ఉన్నారు. 18 మండలాలకు 18 మంది ఏఓలు, జిల్లా కార్యాలయంలో టెక్నీ కల్, ఇతర విభాగాలకు గాను మరో నలుగురు ఏఓలు ఉండాలి. మొత్తం 22 మందికి గాను ప్రస్తుతం 15 మంది ఏఓలు పనిచేస్తున్నారు. 55 క్లస్టర్లకు 55 ఏఈవోలకు గాను 53 మంది ఏఈవోలు విధుల్లో ఉన్నారు.

సస్పెన్షన్లు.. డిప్యూటేషన్లు..

జిల్లాలో వ్యవసాయశాఖలో కొంత కాలంగా సస్పెన్షన్ల పర్వం కొనసాగుతోంది. ఏడాది క్రితం చెన్నూర్ డివిజన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఏఓ వివిధ ఆరోపణల నేపథ్యంలో సస్పెన్షన్‌కు గురయ్యారు. బెల్లంపల్లి ఏఓను సరెండర్ చేశారు. ఇటీవల చెన్నూర్ డివిజన్ పరిధిలో ఏడీఏ జాడిబావు, మరో ఏఓను అవినీతి ఆరోపణల నేపథ్యంలో విచారణ చేపట్టి వ్యవసాయశాఖ కమిషనర్ సస్పెండ్ చేశారు. మరో ఏఓ ఉన్నత విద్య కోసం లాంగ్ లీవ్ కొనసాగుతున్నారు. ఇప్పటివరకు ఇద్దరు ఏఓలు, ఒక ఏడీఏ సస్పెన్షన్‌లో ఉన్నారు. జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయంలో నలుగురు టెక్నికల్ ఏఓలకు గాను ఒక్కరే కొన సాగుతుండగా ఖరీఫ్ సాగు, ఎరువులు, రుణమాఫీ, రైతు భరోసా, రైతు భీమా పథకాలను రైతులకు అవగాహన కల్పించాల్సి ఉంది. ఈ సమయంలో అధికారుల కొరత కారణంగా అధిక వర్షాలకు పంటనష్టాలను క్షేత్ర స్థాయిలో గుర్తించాల్సి ఉంది. కింది స్థాయి సిబ్బందితో పర్యవేక్షణ చేపట్టాల్సి ఉంది.

ఇక్కడ జీతం.. అక్కడ విధులు

మంచిర్యాల డివిజన్ ఏడీఏ నిజామాబాద్ జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయంలో, జిల్లా వ్యవ సాయశాఖ కార్యాలయం(డీఏఓ) ఏడీఏ రమేశ్ 2017 నుంచి ఆదిలాబాద్ జిల్లా వ్యవసా యశాఖ కార్యాలయంలో ఏడీఏగా డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్నారు. ఈయన జిల్లాల విభజనతో మంచిర్యాల జిల్లాకు వ్యవసాయ కార్యాలయంలో ఏడీఏగా వచ్చారు. ఆరునెలల వ్యవధిలోనే డిప్యూటేషన్‌పై అదిలాబాద్‌కు వెళ్లారు. ఏడేళ్లుగా అక్కడ విధులు ఇక్కడ వేతనం తీసుకుంటున్నారు. మంచిర్యాల ఏడీఏగా ఉన్న అనిత నిజామాబాద్‌కు డిపూటేషన్‌పై వెళ్ళారు. కానీ వేతనం ఇక్కడే తీసుకుంటున్నారు. చెన్నూర్ డివిజను, జిల్లా కార్యాలయంలో ఏడీఏలు లేక ఏఓలకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. నెన్నెల, మందమర్రి, చెన్నూరు ఏఓలు లేక పోవడంతో ఇతర మండలాలకు చెందిన ఏఓలకు ఇన్‌చార్జి బాధ్యతలు ఇచ్చారు. ఏడీఏలు లేక కార్యాలయాల పర్యవేక్షణ, ఎరువుల దుకాణాల్లో తనిఖీలు లేక పోవడంతో ఇష్టానుసారంగా నడుస్తున్నట్లు తెలుస్తోంది.

రైతులు నష్టపోయే పరిస్థితి

జిల్లాలో మంచిర్యాల, చెన్నూరు డివిజన్‌లో ఏడీఏ అధికారులు లేరు. చెన్నూర్ ఇన్‌చార్జిగా మందమర్రి ఏఓకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఉన్నొక్క రెగ్యులర్ భీమిని డివిజన్ ఏడీఏ కార్యాల యానికి ఎప్పుడు వస్తున్నారో.. ఎప్పుడు పోతున్నారో తెలియని పరిస్థితి ఉందని రైతులు ఆరోపిస్తున్నారు. దీంతో రైతులకు ఖరీఫ్ సాగుకు రైతు రుణమాఫీ, రైతు భరోసా, భీమా సూచనలు అందడం లేదు. కింది స్థాయి సిబ్బందితో కలిసి రైతువేదికల్లో రైతులకు క్షేత్రస్థాయిలో సమావేశాలు, చైతన్య యాత్రలు నిర్వహించి పంటల మార్పిడి, అధిక దిగుబడితో ఆర్థికంగా ఎదిగేందుకు చైతన్యం తేవాల్సి ఉంది. లేకుంటే రై తులు మూస పద్ధతిలో వేసిన పంటలు మళ్లీ వేయడం, ఒకరిని చూసి ఒకరు పోటీ పడి ఎరువులు వినియోగించడం, చీడపీడల వ్యా ప్తి నివారణ చర్యలు చేపట్టకపోడం, ఇతరసూచనలందక నష్టపోయే పరిస్థితి ఉంది. ఇటీవల ఎరువులు జిల్లా సరిహద్దు దాటుతూ పట్టుబడిన సంఘటనలు వున్నాయి. ఎరువుల పక్కదారిని అరికట్టక పోతే జిల్లాలో ఎరువుల కొరత ఏర్పడే ప్రమాదం ఉంది.

మైన్ సేఫ్టీ అవార్డు దక్కించుకున్న ఆర్కే-5 గని



నవతెలంగాణ-నస్పూర్

దేశవ్యాప్తంగా బొగ్గు గనులకు ఇచ్చే జాతీయస్థాయి అవార్డును సింగరేణి సంస్థ శ్రీరాంపూర్ డివిజన్‌లోని రవీంద్ర ఖని ఆర్కే-5వ గని అందుకుంది. కలకత్తాలో ఆదివారం జాతీయస్థాయి అవార్డుల ప్రధానోత్సవం నిర్వహించారు. మైన్ సేఫ్టీ అవార్డు 2024 కింద సింగరేణిలోని ఆర్కే-5 గనికి 'కోల్ అండర్ గ్రౌండ్ స్మాల్ క్యాటగిరి కింద అవార్డు దక్కింది. జులై 19న తనిఖీ బృందం ఆర్కే-5 గనిని సందర్శించి పని పద్ధతులు, రక్షణలో ఆర్కే-5 గని ఉద్యోగులు పాటిస్తున్న ఎస్‌ఓపీలు, సంబంధిత రికార్డులను తనిఖీ చేశారు. ఆర్కే-5 గని అధికారులు, ఉద్యోగులు రక్షణ పట్ల అనుసరిస్తున్న విధానాల పట్ల తనిఖీ బృందం వారు హర్షితులయ్యారు. తద్వారా తనిఖీ బృందం ఆర్కే-5గనిని మొదటి స్థానం కొరకు సిఫార్సు చేశారు. అలాగే గనికి భారతదేశంలోనే 'కోల్ అండర్ గ్రౌండ్ స్మాల్ క్యాటగిరి' కింద మొదటి స్థానం వచ్చింది. ఈ అవార్డును సింగరేణి సంస్థ ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్ డైరెక్టర్ జి.వెంకటేశ్వర్‌రెడ్డి (జీవీ రెడ్డి), గని మేనేజర్, డీవై జీఎం ఎండీ. అబ్దుల్ ఖాదీర్‌లు మైనింగ్ డీజీఎం ఎస్ ప్రభాత్ కుమార్ చేతుల మీదుగా అందుకున్నారు. సింగరేణి సంస్థకు అవార్డు దక్కడం పట్ల సీ అండ్ ఎండీ నునావత్ బలరాం, డైరెక్టర్‌లు ఎన్‌వికె శ్రీనివాస్(ఆపరేషన్స్ అండ్ పా), డీ సత్యనారాయణ రావు(ఈ అండ్‌ఎం), తెలంగాణ ప్రాంతానికి చెందిన కోల్ ఇండియా టెక్నికల్ డైరెక్టర్ బి.వీరారెడ్డి, శ్రీరాంపూర్ డివిజన్ జీఎం సంజీవ రెడ్డి, గని ఏజెంట్ ఏవి రెడ్డి అభినందనలు తెలిపారు.

మిడ్ మానేరుకు ఎల్లంపల్లి నీళ్లు

- నంది పంప్ హౌజ్ నుంచి 12600 క్యూసెక్కుల నీటి తరలింపు



నవతెలంగాణ-హాజీపూర్

ఎల్లంపల్లి నుంచి మిడ్ మానేరుకు నీటి తరలింపు ప్రక్రియ ప్రారంభించారు. ప్రస్తుతం నంది పంప్ హౌజ్ నుంచి 12600 క్యూసెక్కుల నీటిని పంప్‌ల ద్వారా ఎత్తిపోస్తున్నారు. మిడ్ మానేరుకు ఇంకా వరద నీరు చెరకపోవడంతో అక్కడ సాగు నీటికీ ఇబ్బందులు ఎదరువుతున్న సందర్భంగా ఆ ప్రాజెక్టును నింపే ప్రక్రియ కొనసాగుతుంది. నంది పంప్ హౌజ్ నుంచి నంది మేడారం జలయశయాని నింపి అక్కడి నుండి గాయత్రి పంప్ హౌజ్ ద్వారా కాలువలోకి నీటిని ఎత్తిపోసి మధ్యమానేరు జలాశయాన్ని నింపే ప్రక్రియ కొనసాగుతుంది.

నిలకడగా ఎల్లంపల్లి..

ఎల్లంపల్లి ప్రాజెక్టు పూర్తి సామర్యం 20 టీఎంసీలకు గాను ప్రస్తుతం 18 టీఎంసీల నీరు నిలువ ఉంది. ఇన్ ఫ్లో రూపంలో 20643 క్యూసెక్కు నీరు ప్రాజెక్ట్ లోకి వచ్చి చేరుతుంది. కాగా 12600 క్యూసెక్కుల నీటిని మిడ్ మానేరుకు తరలిస్తున్నారు. ఇంకా ఈ సీజన్‌లో ఇప్పటి వరకు ప్రాజెక్ట్ గేట్లు ఎత్తలేదు.

ఉర్సు ఉత్సవాలకు ఎమ్మెల్యే వితరణ



నవతెలంగాణ-తాండూర్

ఈ నెల 31 నుండి రెండు రోజులపాటు జరిగే ఉర్సు ఉత్సవాల నిర్వహణకు ఎమ్మెల్యే గడ్డం వినోద్ రూ.25 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ప్రతి ఏటా మండల కేంద్రంలోని దర్గా వద్ద జరిగే ఉర్సు ఆత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. మండల కేంద్రంతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఉర్సు ఉత్సవాల్లో పాల్గొంటారు. ఉర్సు ఉత్సవాల సందర్భంగా కవ్వాలి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. కుల మతాలక తీతంగా జరిగే ఈ జాతరలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తారు. తాండూరు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఈసా ప్రోద్బలంతో ఎమ్మెల్యే రూ.25 వేల నగదును నిర్వహణకు అందించారు ఈ సందర్భంగా ముస్లిం సోదరులు ఈసకు అభినందనలు తెలిపారు. ఈ సంవత్సరం ఉర్సు ఉత్సవాలు మరింత ఘనంగా జరిపేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

దేశ రాజధానిలో గని మేనేజర్ కూతురు మృతి



నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలో ఎస్ఆర్పీ1 గనిలో మేనేజర్‌గా పని చేస్తున్న విజయ్ కుమార్ కూతురు తానియా సోనీ(25) దేశ రాజధానిలో వరదల్లో చిక్కుకొని మృతి చెందింది. విజయ్ కుమార్ స్వస్థలం బీహార్ కాగా వృత్తిరీత్యా తెలంగాణలోని సింగరేణిలో పని చేస్తున్నారు. ఢిల్లీలోని ఓల్డ్ రాజేంద్ర నగర్‌లో ఓ బిల్డింగ్ సెల్లార్‌లో ఏర్పాటు చేసిన రౌస్ స్టడీ సెంటర్‌లో సివిల్స్ కోచింగ్ కోసం సోని రాజధానికి వెళ్లారు. సెల్లార్‌లోకి వచ్చిన భారీ వరద నీటిలో చిక్కుకుని ముగ్గురు అభ్యర్థులు మృత్యువాత పడ్డారు. కూతురిని సివిల్ సర్వీసెస్ ఆఫీసర్ చేయాలని కలలు కన్న విజయకుమార్ దంపతులకు ఆమె చనిపోయిన విషయం తెలిసి కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ఐఏఎస్ ఆఫీసర్‌గా సెలెక్ట్ అయి సోని దేశానికి సేవలందించాలని భావించిన ఈ కుటుంబం ఆమె మరణ వార్త విని భావోద్వేగానికి గురయ్యారు. ఆమె అంత్యక్రియలు స్వస్థలమైన బీహార్లో జరిగాయి.

రైతు భీమా దరఖాస్తులు స్వీకరించాలి

నవతెలంగాణ-జన్నారం

మండలం పరిధిలోని గ్రామాలలో కొత్తగా పట్టాలు పొందిన కొంతమంది రైతులు గల్ఫ్ దేశం వెళ్లారు. వారి రైతు బీమా దరఖాస్తులను వారి కుటుంబ సభ్యులచే స్వీకరించాలని గల్ఫ్ సంక్షేమ సమితి మండల అధ్యక్ష, కార్యదర్శులు పొలాజీ శ్రీనివాస్, దుమల ఎల్లయ్య ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం రైతు బీమా దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం చేపట్టి 28 జూలై వరక గడవు ప్రకటించారు. గల్ఫ్‌లో ఉన్న కార్మికులు దరఖాస్తు ఇవ్వడానికి రావాలంటే ఒక కార్మికునికి రూ.50 నుండి రూ.60 వేల కర్చు అవుతుంది. వారి దరఖాస్తు వారి కుటుంబ సభ్యుల ద్వారా ఇవ్వడానికి రైతు వేదిక వద్దకు వెళితే తిరస్కరిస్తున్నారని, కాబట్టి ప్రభుత్వ గల్ఫ్ కార్మికుల కుటుంబాల ద్వారానే వారి బీమా దరఖాస్తులను తీసుకోవాలని కోరుతున్నామన్నారు. మండలంలోని అగ్రికల్చర్ ఆఫీసర్స్ ఈ విషయంపై పునరాలోచన చేసి గల్ఫ్‌లో ఉన్న రైతుల దరఖాస్తును వారి కుటుంబ సభ్యుల ద్వారా స్వీకరించాలని మనవి చేశారు.

కమ్యూనిస్టు పార్టీ నిర్మాణంలో భాగస్వాములు కావాలి



నవతెలంగాణ-నస్పూర్

కమ్యూనిస్టు పార్టీ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేని శంకర్ అన్నారు. ఆదివారం శ్రీరాంపూర్ శాఖ కమ్యూనిస్టు పార్టీ నిర్మాణ కౌన్సిల్ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్‌తో కలిసి పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ డిసెంబర్‌తో సీపీఐ ఏర్పడి 100 సంవత్సరాలు పూర్తి చేసుకుంటుందని, అనేక పోరాటాలు ఉద్యమ చరిత్ర కలిగిన భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ నిర్మాణంలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. ఈ సందర్భంగా సింగపూర్, శ్రీరాంపూర్ శాఖ 21 కౌన్సిల్ సభ్యులు, 11 కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. నూతన కార్యదర్శిగా పూజారి రామన్న, సహాయ కార్యదర్శిగా కొత్తపల్లి మహేష్, కోశాధికారి కూన సాయి కిరణ్ ఎన్నుకోబడ్డారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి జోగుల మల్లయ్య, నాయకులు కారుకూరి నగేష్, కొట్టే కిషన్ రావు, బొడ్డు లచ్చన్న, లింగమూర్తి, నూకల రాజయ్య, సదానందం, వంశిలు పాల్గొన్నారు.

గని ప్రమాదానికి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-నస్పూర్

గోదావరిఖని రెండవ గని ప్రమాదానికి కారకులైన అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని బీఎంఎస్ కేంద్ర ఉపాధ్యక్షుడు చాట్ల అశోక్, శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు నాతాడి శ్రీధర్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఓపెన్ కాస్ట్ ప్రమాదం లో చనిపోయిన ఇద్దరు కార్మికుల విశాదఛాయలనుండి కార్మికులు కోలుకోకముందే జీడికే-2 గని ప్రమాదం జరగడం దురదృష్టకరమని, గనుల్లో జరుగుతున్న వరుస ప్రమాదాలతో కార్మికులు బెంబేలెత్తిపోతున్నారని ఆరోపించారు. ప్రమాదం పొంచి ఉందని కార్మికులు తెలియజేసినప్పటికీ రక్షణ విభాగం అధికారుల పర్యవేక్షణ కొరవడినందునే గని ప్రమాదం జరిగిందని పేర్కొన్నారు. పని స్థలాలలో రక్షణ చర్యల నిబంధనలను ఉల్లంఘించిన అధికారులపైన వెంటనే చర్యలు తీసుకోవాలని అన్నారు.

మండల వాసికి స్వర్ణ నంది సేవారత్న పురస్కారం

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని కవ్వాల్ గ్రామానికి చెందిన, బంజారా యువజన సేవా సంఘం మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బాధావత్ శ్రీనివాస్ నాయక్ స్వర్ణ నంది సేవా రత్న అత్యున్నత పురస్కారం అందుకున్నారు. హైదరబాద్‌లో ఆదివారం జరిగిన శ్రీ త్యాగరాయ గానసభలో మెగా ఎంటర్‌ప్రైజెస్ స్వర్ణ నంది సేవారత్న అవార్డు కార్యక్రమంలో ఈ అవార్డును శ్రీనివాస్ ఆదిలాబాద్ జిల్లా మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్, సినీ ప్రముఖులు జెమిని సురేష్, ఫిట్నెస్ అను, రాష్ట్ర ఆర్యవైశ్య అధ్యక్షుడు పురుషోత్తం, శిరీషరెడ్డిల చేతుల మీదుగాఅవార్డును అందజేశారు. అనంతరం శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ నేను చేస్తున్న సేవా కార్యక్రమాలకు ఇలాంటి వేదికల్లో అవార్డు ఇవ్వడం నేను ఇంక ముందుకు సాగేలా ప్రోత్సాహకం లభించడం చాలా సంతోషంగా ఉంది అని అన్నారు.

